ప్రజాశక్తి

గురువారం 15 ఆగస్టు 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





మందకొడిగా వరి సాగు

◆ జలాశయాల కిందా అదే పరిస్థితి ◆ 1.32 లక్షలకు 32 వేల ఎకరాల్లో పంట నమోదు



సాగైన చోట రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో వరిసాగు మందకొడిగా సాగుతోంది. వర్షాలు సకాలంలో సరిపడినంత సమృద్ధిగా కురవకపోవడం, వున్న కొద్దిపాటి సాగునీటి వనరులను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంతో రైతుకు ఏటా ఖరీఫ్‌లో సాగు కష్టాలు తప్పడంలేదు. జిల్లాలోని 24 మండలాల్లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,32,802 ఎకరాలకు 32,507 (24.47 శాతం) ఎకరాల్లో వరి సాగు నమోదైంది. ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు 13 వరకు 450.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సివుండగా 370.3 మిల్లీ మీటర్లు కురిసింది. వర్షాలు నిలకడగా పడకపోవడంతో వరి సాగు ముందుకు వెళ్లడంలేదు. జలాశయాలు, కాలువల మరమ్మతులు కొన్నేళ్లుగా పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో వాటి పరిధిలో కూడా వరి సాగు సరిగాలేదు. అనకాపల్లి వ్యవసాయశాఖ డివిజన్‌లో 16,267 ఎకరాలకు 902 (5.54 శాతం) ఎకరాల్లో ఉడుపులు జరిగాయి. యలమంచిలి డివిజన్‌లో 20,982 ఎకరాలకు 2,255 (10.74 శాతం) ఎకరాల్లో వరి సాగు నమోదైంది. చోడవరం డివిజన్‌లో 32,680 ఎకరాలకు 12,015 (36.76 శాతం) ఎకరాలు, పాయకరావుపేట డివిజన్‌లో 34,130 ఎకరాలకు 9,330 (27.33 శాతం) ఎకరాలు, నర్సీపట్నం డివిజన్‌లో 28,742 ఎకరాలకు 8005 (27.85 శాతం) ఎకరాల్లో రైతులు వరి పంట వేశారు.

జలాశయాల కింద భూముల్లోనూ వరి సాగు అంతంత మాత్రంగానేవుంది. 32,689 ఎకరాలకు సాగునీరందించే తాండవ జలాశయ నీటిని సాంకేతిక సమస్యలతో ఇంకా విడుదల చేయలేదు. దీంతో దీనికిందనున్న ఆయకట్టులో వరి సాగు నమోదుకాలేదు. రైవాడ కింద 15,344 ఎకరాలకు 500 ఎకరాలు, కోనాం కింద 12,276 ఎకరాలకు వెయ్యి ఎకరాలు, పెద్దేరు జలాశయం కింద 15,105 ఎకరాలకు 878 ఎకరాల్లో మాత్రమే వరి సాగైంది. వరి సాగైన ప్రాంతాల్లో జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి.మోహనరావు తన సిబ్బందితో కలిసి పంటసాగులో తీసుకోవాల్సిన మెలకువలపై రైతుకు సూచనలు ఇస్తున్నారు. కాలపరిమితిలోపు వరి సాగు పూర్తవుతుందని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.



పోలీస్ బ్యారెక్స్ వద్ద సాగుతున్న ఏర్పాట్లు

స్వాతంత్ర్య వేడుకలకు ఘన ఏర్పాట్లు

78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. విశాఖ నగరంలోని పోలీసు బ్యారెక్స్‌ను ఉత్సవాల కోసం బుధవారం నాటికే సుందరంగా తీర్చిదిద్దారు. అతిథులు, వీక్షకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చారిత్రక కట్టడమైన కలెక్టరేట్‌ను త్రివర్ణ విద్యుత్ దీపాలతో అలంకరించారు.



స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవం

▶ వార్త మెయిన్‌లో..

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో హక్కులకై పోరాటం

▶ వార్త 5లో..

బార్క్ అదనపు భూ సేకరణ అడ్డగింత

▶ వార్త 6లో..



నిరసన ర్యాలీ చేపట్టిన వైద్య విద్యార్థులు

జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ..

వైద్య విద్యార్థుల నిరసన

నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్

వార్త 2లో..

జిల్లా గ్రంథాలయ పునర్నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహారాణిపేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరం స్థలంలో వెంటనే గ్రంథాలయ పునర్నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా గ్రంథాలయ పునర్నిర్మాణం కోసం పౌర గ్రంథాలయాల సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత స్టేట్ లైబ్రరీ ఒకటి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండాలన్నారు. అందుకు తగిన స్థలం, తగిన ప్రాంతం, తగినన్ని నిధులు విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థకు ఉన్నాయని తెలిపారు. దొండపర్తిలోని రీజనల్ ప్రభుత్వ గ్రంథాలయానికి మద్రిపాలెం వద్ద స్థలం ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ ఏనాడో నిర్ణయించారని, అయితే ఆ స్థలం తీసుకొని అక్కడ రీజనల్ గ్రంథాలయం నిర్మించే ఏర్పాట్లు ఏళ్లు గడుస్తున్నా జరగలేదని అన్నారు. ఇక మహారాణిపేట ప్రాంతంలో ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలాన్ని గతంలో ఒక నాయకుడు ఆక్రమించే ప్రయత్నం చేయగా పౌర గ్రంథాలయాల సేవా సమితి ద్వారా నిరసనలు, ఆందోళనలను నిర్వహించడం, అప్పటిలో ఎమ్మెల్సీగా ఉన్న తాను శాసన మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో పలు పరిణామాల నేపథ్యంలో గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరం మిగతా 2లో..



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

మొదటి పేజీ తరువాయి..

జిల్లా గ్రంథాలయ పునర్నిర్మాణం చేపట్టాలి

స్థలం జిల్లా గ్రంథాలయ సంస్థకు దఖలుపడిందన్నారు. ప్రస్తుతం ఆ స్థలం ఖాళీగా ఉందన్నారు. దీని నిర్మాణానికి రూ.30 కోట్లు సరిపోతాయని తెలిపారు. జివిఎంసి వద్ద గ్రంథాలయం సెస్సు పేరుతో ఇళ్ల పన్నుల నుంచి 8 శాతంగా వసూలు చేసిన సుమారు రూ.300 కోట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. స్థలం సిద్ధం, అవసరమైన నిధులు సిద్ధం.. ఈ నేపథ్యంలో ప్రభుత్వ చిత్తశుద్ధి ఉంటే వెంటనే భవన నిర్మాణం చేపట్టవచ్చునన్నారు. కానీ అలా జరగడం లేదన్నారు. 2010 నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలం వివాదం కొనసాగుతోందని, రాష్ట్రంలో రెండు ప్రభుత్వాలు మారిపోయాయని తెలిపారు. కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఇప్పటికైనా చొరవ తీసుకోవాలని కోరారు. గ్రంథాలయం లేకపోతే జరిగే నష్టం వారికి తెలియదా ? అని ప్రశ్నించారు. గ్రంథాలయ భవన నిర్మాణం కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పౌర గ్రంథాయాల సేవా సమితి అధ్యక్షులు బిఎల్.నారాయణ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ భవన స్థలాన్ని కాపాడుకునేందుకు జరిగిన పోరాట చరిత్రను వివరించారు. .సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణం కోసం అవసరమైన నిధుల కోసం జివిఎంసిలో తాము పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిపిపి పద్ధతిలో ప్రభుత్వ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూస్తోందన్నారు. ఎయు మాజీ ప్రొఫెసర్ సుబ్బారాయుడు మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా సాధించుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలం ప్రయివేటు వ్యక్తులపాలు కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేసే ఆలోచన మంచిది కాదన్నారు. తమ వంటి పేద తరగతికి చెందిన ఎందరో గ్రంథాలయాలపై ఆధారపడి ఉన్నత చదువులు చదువుకొని, కలెక్టర్లు వగైరా ఉన్నత ఉద్యోగాలను సాధించగలిగారని, అటువంటి వారిలో తాను కూడా ఒకడినని చెప్పారు. సమావేశంలో సేవా సమితి కోశాధికారి పి.మల్లేశ్వరరావు, ఎయు మాజీ ప్రొఫెసర్ ధనరాజు, సిహెచ్‌విఎల్‌ఎన్.శాస్త్రి, డాక్టర్ కె.రమాప్రభ, లక్ష్మీపతి, పి.మణి, ఎన్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



తాము వేసిన బొమ్మలను చూపుతున్న చిన్నారులు

విసిసి ఆధ్వర్యాన బహుముఖ పోటీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశాఖ జిల్లాలోని పిల్లలకు వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో బుధవారం ట్యూషన్ సెంటర్లలో డ్రాయింగ్, క్విజ్, వ్యాస రచన, ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు జాతీయ జెండా, దేశభక్తి, స్వాతంత్ర్య సమరయోధులకు సంబంధించిన అంశాలపై ఈ పోటీలు సాగాయి. పోటీలలో పాల్గొన్న వారికి బహుమతి ప్రదానం గురువారం జరుగుతుందని కన్వీనర్ కె.సుశీల మీడియాకు తెలిపారు. ఆసరా ఛారిటబుల్ సొసైటీ, విశ్వ మానవ సంక్షేమ సంఘం సహకారంతో పోటీలు నిర్వహించామన్నారు. భీమిలి, మధురవాడ, ఆరిలోవ, మద్దిలపాలెం, జగదాంబ, కంచరపాలెం, గోపాలపట్నం, గాజువాక, మల్కాపురం, ఉక్కునగరం జోన్లలో ఈ పోటీలు సాగాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో శైలజ, నీలవేణి, సంధ్య, అప్పలకొండ, అనసూయాదేవి, కృష్ణవేణి, యామిని, దివ్య, దీప్తి, సుమ, శిరీష, కల్యాణి, సతీష్, గణేష్, సంతోషి పాల్గొన్నారు.

17న మిలీనియం క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ మరో భారీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టింది. ఈ నెల 17న భార్గో ఇన్నోవేషన్స్ అనే ప్రముఖ సంస్థతో కలిసి డ్రైవ్ నిర్వహించనున్నట్టు ఆ సంస్థ సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం పోస్టర్ అవిష్కరించారు. స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోసం ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. మాంద్యం రోజుల్లో కూడా ప్లేస్‌మెంట్ చూపించడం, విద్యార్థులను ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు. 17వ తేదీ నాటి డ్రైవ్‌లో కనీసం 50 ప్లేస్‌మెంట్లు కల్పించే ధ్యేయంతో పనిచేస్తున్నామన్నారు. మెకానికల్ విద్యార్థుల కోసం గత వారం డ్రైవ్ నిర్వహించగా 97మంది విద్యార్థులు ప్లేస్మెంట్ పొందారని గుర్తు చేశారు. 24 ఏళ్ల నుంచి తమ సంస్థ జాబ్ మేళాలు/క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ వస్తోందని, అలా ఇప్పటి వరకు 1.5 లక్షల మంది ప్లేస్‌మెంట్ పొందారని అన్నారు. 2023- 2024 మధ్య 60 శాతం బీటెక్ (సీఎస్ఈ), సీ పైథాన్, డాట్.నెట్ ఫ్రేమ్ వర్క్, హెచ్‌టిఎంఎల్, సీఎస్ఎస్/జావా స్క్రిప్ట్ కోర్సుల్లో నైపుణ్యం ఉన్న ఇతర బీటెక్ గ్రాడ్యుయేట్లు ఈ డ్రైవ్‌కు అర్హులని మిలీనియం హెచ్ఆర్ మేనేజర్ బి.రమ్యశ్రీ అన్నారు. విశాఖ పరిధిలో భార్గో సంస్థ ఒక ప్రముఖ ఐటీ, బిజినెస్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న వారంతా 17న నేరుగా మిలీనియం క్యాంపస్‌కు రావచ్చని, లేదా hr@millenniumsoftsol.comకు తమ రెజ్యూమ్‌ను పంపవచ్చని తెలిపారు. ఈ డ్రైవ్‌కు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని, అధిక సంఖ్యలో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాల కోసం www.millenniumsoftsol.com వెబ్ సైట్‌ను సందర్శించవచ్చని, 9248753098 ఫోన్ నంబర్‌లో మాట్లాడవచ్చని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఆర్ ప్రతినిధి హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల ప్రగతి భారీగా పెరగాలి

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షల మేరకు జిల్లాలో నిర్మిస్తున్న గృహాల ప్రగతి భారీగా పెరగాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ గృహ నిర్మాణ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ లేఅవుట్లలో చేపట్టిన గృహ నిర్మాణాలు, వాటి పురోగతిపై బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో గృహ నిర్మాణ శాఖ పీడీ డి.అఖిల, ఇతర అధికారులతో ఆయన సమీక్షించారు. పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన ఆయన లేఅవుట్ల తాజా పరిస్థితిని ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంద రోజుల్లో 71 వేల గృహాలు స్టేజ్ అప్డేషన్ జరగాలని ఇప్పటికే ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఆ దిశగా జిల్లా స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు తీవ్ర కృషి చేయాలని ఆదేశించినప్పటికీ పనుల్లో పురోగతి లేదన్నారు. గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, నీరు, సిబ్బంది కొరత లేదని, అలాగే ఇప్పటివరకు చేపట్టిన పనులకు చెల్లింపులు కూడా జరిగాయని తెలిపారు. అయినప్పటికీ పనుల్లో పురోగతి కనిపించడం లేదని, ఇకపై ప్రగతి సాధించకుంటే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇచ్చిన లక్ష్యానికి ఇంకా 14 వారాలు సమయం ఉన్నందున ప్రతి వారం 5 వేల గృహాలు స్టేజ్ అప్డేషన్ కావాల్సిందేనని తేల్చిచెప్పారు. గుత్తేదారులకు ఎటువంటి బకాయిలు లేనందున వారితో మాట్లాడి త్వరితగతిన పనులు చేయించాల్సిన బాధ్యత గృహ నిర్మాణ శాఖ అధికారులదేనని అన్నారు. పనిచేయని గుత్తేదారులకు తక్షణమే నోటీసులు జారీచేసి, పనులు ప్రారంభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో గహ నిర్మాణ శాఖ ఇఇ సత్యనారాయణ, డిఇలు రామకృష్ణ, సూర్యప్రకాశ్, సీతారాం, ఎఇ సూర్యప్రకాశరావు, ఇతర ఎఇలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ..

కెజిహెచ్‌లో వైద్య విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కొల్‌కతా మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ బుధవారమూ ఆంధ్ర మెడికల్ కాలేజీ విద్యార్థులు (జూడాలు) పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. కెజిహెచ్‌లో ఓపీ సేవలను నిలిపివేశారు. ఆంధ్ర మెడికల్ కళాశాల నుంచి కెజిహెచ్ వరకు పెద్ద ర్యాలీ నిర్వహించారు. సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట కొంతసేపు నిరసన తెలిపారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్లకార్డులను ప్రదర్శించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ టి.పృధ్వీ మీడియాతో మాట్లాడుతూ సెంట్రల్ హెల్త్ కేర్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని కోరారు. జూనియర్ డాక్టర్లకు రక్షణ కల్పించాలన్నారు. నిరసనలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ ఆర్.ఊహ, కార్యదర్శి డాక్టర్ వై.రాజ్, డాక్టర్ వివేక్, అధిక సంఖ్యలో జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ అసంతృప్తి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ ప్రజారోగ్య విభాగం పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనా థియేటర్‌లో జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోన్ల కమిషనర్లు, ఎఎంఒహెచ్‌లు, వార్డు సచివాలయం శానిటరీ కార్యదర్శులతో స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కెపాసిటీ బిల్డింగ్, స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కార్యక్రమాల అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ ముందుగా స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కార్యక్రమాల పారామీటర్లను, నియమ నిబంధనలను వీడియో ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. అనంతరం మాట్లాడుతూ స్వచ్ఛభారత్ 2.0లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ 2024కు సంసిద్ధం కావాలని విశాఖ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మూడు వారాలుగా నగరంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించడం జరిగిందని, నగరంలో పారిశుధ్య పనులు సరిగా జరగడం లేదని తెలిపారు.

'ఉక్కు'ను ప్రైవేటుపరం కానివ్వం

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానిచ్చేదిలేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు, డి.ఆదినారాయణ, స్టీల్ ఒబిసి అసోసియేషన్ అధ్యక్షులు బి.అప్పారావు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1280వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఒబిసి అసోసియేషన్‌కు చెందిన కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి రోజురోజుకూ తగ్గిపోతుండటంతో కార్మికుల్లో ఆందోళన రేగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం కావాలనే ఉత్పత్తిని తగ్గించి స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల వైపు నడిపిస్తున్నాయన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా ఉద్యమాలకు మరింత పదును పెట్టనున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉక్కు పరిరక్షణ పోరాటం జరుగుతోందని, అన్ని రంగాల కార్మికులు, ప్రజలు, నాయకులు తరలివచ్చి కేంద్ర బిజెపి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా, ప్రభుత్వ రంగంలోనే కొనసాగే విధంగా పోరాటం సాగిస్తూ కాపాడుకుంటామని టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పిలి రామకృష్ణ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు బుధవారానికి 1232వ రోజుకు చేరాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి నాయకులు నక్కా లక్ష్మణరావు, జిల్లా ఉపాధ్యక్షులు ముప్పాళ్ళ శ్రీకృష్ణ, సాత్రబోయిన చిన్న అప్పారావు, ఇలిపిల్లి అప్పారావు, కొప్పాక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం వినాయకున్ని దర్శించుకున్న మంత్రి అనిత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత బుధవారం కలెక్టరేట్ సమీపంలోని బెల్లం వినాయకున్ని, ఆశీలుమెట్టలోని సంపత్ వినాయకున్ని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ వైసిపి ఎమ్మెల్సీల కోసం ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని అన్నారు. పెద్దల సభకు మచ్చ తెచ్చే విధంగా కొంతమంది ఎమ్మెల్సీల ప్రవర్తన ఉందన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు ఆయన డ్రైవర్‌ను చంపేసి డోర్ డెలివరీ చేశారని, అలాంటి వ్యక్తితో జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించలేదని అన్నారు. ప్రజలకు ఆదర్శప్రాయంగా ఉండవలసిన ప్రజాప్రతినిధులు రోడ్లపైకి వచ్చి రచ్చ చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీలుగా పంపించే వ్యక్తుల కోసం ఆ పార్టీ నాయకులు, అధిష్టానం ఆలోచించుకొని నిర్ణయం తీసుకోవాలన్నారు.

యువతకు సమాజం మీద బాధ్యత ఉండాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యువతకు సమాజం మీద బాధ్యత ఉండాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దండి ప్రియాంక అన్నారు. బుధవారం ఉదయం నగరంలోని సెయింట్ జోసెఫ్ కాలేజీలో ఏర్పాటుచేసిన విద్యార్థుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సమాజం పట్ల, రాజకీయ పట్ల యువత ఆసక్తి చూపించకపోతే దేశం వెనుకబడిపోతుందని, స్వార్థపరులు, అవినీతిపరులతో వ్యవస్థ నిండిపోతుందని అన్నారు.

కుసులవాడలో మైనింగ్‌తో తీవ్ర నష్టం


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎన్.మూర్తి

నోటిఫికేషన్ రద్దు చేయాలంటూ 16,17 తేదీల్లో పాదయాత్ర

సిపిఎం నాయకుల వెల్లడి

ప్రజాశక్తి -తగరపువలస : ఆనందపురం మండలం కుసులవాడలో మైనింగ్ తవ్వకాలకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన ఈ నెల 16, 17 తేదీల్లో కుసులవాడ పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించనున్నట్లు పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి చెప్పారు. పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కుసులవాడ భూముల్లో క్వార్ట్ జైట్ తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఈ నెల 28న ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టేందుకు సంబంధిత అధికారులు సిద్ధమవుతున్నారని తెలిపారు. కొండలను, ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు లేదా అని ప్రశ్నించారు. కుసులవాడలో మైనింగ్ తవ్వకాల వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆ ప్రాంత ప్రజల జీడి, మామిడి, కొబ్బరి తోటలతో పాటు ఇతర పంటలకు అపార నష్టం జరుగుతుందన్నారు. గాలి, తాగు నీరు కలుషితం అవుతాయని , కాలుష్య ప్రమాదం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కొండలను, పర్యావరణాన్ని కాపాడుతుందని అక్కడి ప్రజలు ఆశాభావంతో ఉన్నారని అన్నారు. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి స్థానిక ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ జోన్ కమిటీ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పల నాయుడు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ అమలుపై ఒత్తిడి పెంచాలి'

ప్రజాశక్తి -భీమునిపట్నం, ఆనందపురం


సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి భీమిలి నియోజకవర్గం వైసిపి సర్పంచులు, జడ్పిటిసిలు, ఎంపిటిసిలను కోరారు. తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తం శెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యాన భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల వైసిపి సర్పంచులు, జడ్పిటిసిలు, ఎంపిటిసి సభ్యులతో జగన్మోహన్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, గత ఐదేళ్ల పాలనలో కులం, మతం చూడకుండా ఇచ్చిన మాట ప్రకారం అర్హులకు సంక్షేమ పథకాలు అందజేసామని గుర్తుచేశారు. అనంతరం వైసిపి ఆనందపురం మండల అధ్యక్షులు బంక సత్యం నియోజకవర్గంలోని పలు సమస్యలను జగన్‌కు వివరించారు.

డిగ్రీలో ప్రవేశాలకు 16వ తేదీ తుది గడువు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ, బి.కాం, బిఎస్సీ కోర్సుల్లో తొలి విడత ప్రవేశాలకు ఈ నెల 16వ తేదీ తుది గడువని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమకు కేటాయించిన అలాట్ మెంట్ ఆర్డర్లు, ధ్రువీకరణ పత్రాలతో హాజరై అడ్మిషన్లు పొందాలని విద్యార్థులకు సూచించారు.

ఆరోగ్యశ్రీ డీసీ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురంలో బుధవారం నిర్వహించిన 104 వైద్య శిబిరాన్ని ఆరోగ్యశ్రీ పథకం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. 104 వాహన సిబ్బంది పనితీరును, ఫ్యామిలీ డాక్టర్ పథకం అమలు తీరును గమనించారు. రికార్డులు, రోజువారీ నివేదికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి షహనాజ్ సాధియ, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఎంఎల్‌హెచ్‌పి సౌందర్య, ఎఎన్ఎం.దేవి, ఆరోగ్య కార్యకర్త రమణ, రమేష్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -మధురవాడ : ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలు, ర్యాగింగ్ చట్టాలపై అవగాహన కలిగించడానికి గీతం విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆధ్వర్యాన బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (నార్త్) బి.సునిల్ ముఖ్యఅతిథిగా హాజరై ర్యాగింగ్ నిరోధ చట్టాలను విద్యార్థులకు వివరించారు. విద్యా సంస్థలలో విద్యార్థుల మధ్య స్నేహ సంబంధాలు, పోటీ వాతావరణం ఉండాలని, ర్యాగింగ్ వంటి విష సంస్కృతికి దూరంగా ఉండాలని సూచించారు. పిఎం.పాలెం పోలీస్ ఇన్‌స్పెక్టర్ వై.రామకృష్ణ, డాక్టర్ ఎస్‌పి.రావు, గీతం ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ టివి.నాగరాజ, గీతం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమణరావు, మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ వ్యతిరేక ర్యాలీని నిర్వహించారు.

బొత్సను కలిసిన బెహరా

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను ఆ పార్టీ మండల అధ్యక్షులు బెహరా భాస్కరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్సను అభినందించారు.

ముడసర్లోవ, ఎండాడలో జివిఎంసి కమిషనర్ పర్యటన

పార్కు పనుల ఆలస్యంపై ఆగ్రహం

ప్రజాశక్తి - యంత్రాంగం

అరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి ముడసర్లోవలో, జోన్-2 పరిధి ఎండాడలో బుధవారం జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్ పర్యటించారు. ముడసర్లోవ చిల్డ్రన్ పార్క్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పార్క్ పనులు ఆలస్యంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ, పార్కును త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్కులో ప్రస్తుతం ఉన్న చెట్లను తొలగించకుండా నిర్మాణాలు చేపట్టాలని, కొన్నిచోట్ల నిర్మాణాలకు అడ్డంగా ఉన్న చెట్లను మరొక చోటుకు ట్రీ ట్రాన్స్ లోకేషన్ చేయాలని ఆదేశించారు. పార్కులో ఓపెన్ ఎయిర్ థియేటర్, చిల్డ్రన్ ప్లే ఏరియా, వాకింగ్ ట్రాక్, 15 సంవత్సరాల పిల్లల వరకు కావలసిన అన్ని ఆట పరికరాలు, టాయిలెట్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, 2వ జోనల్ కమిషనర్ శైలజ వల్లి, కార్యనిర్వాహక ఇంజినీరు శాంతిరాజ్, సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎన్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండాడ చెరువు పరిశీలన

మధురవాడ : జివిఎంసి జోన్-2 పరిధిలోని ఎండాడ చెరువులో దోమలు వృద్ధి చెందకుండా మలేరియా లార్వల్ ఆయిల్ (ఎంఎల్ ఆయిల్)ను డ్రోన్ల ద్వారా వెదజల్లే ప్రక్రియను, సమీపంలో ఉన్న రెడ్యూస్ రీసైకిల్ రియూజ్ (ఆర్ఆర్ఆర్) సెంటర్‌ను బుధవారం జివిఎంసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర పరిధిలోని నీటి కొలనులలో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టేందుకు డ్రోన్స్ స్ప్రేయింగ్ యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టేందుకు డ్రోన్స్ స్ప్రేయింగ్ యంత్రాల సహకారం అవసరమని, నీటి కొలనులలో దోమలు లార్వాను అరికట్టేందుకు డ్రోన్ల సహకారంతో స్ప్రేయింగ్ చేసేందుకు వీలుగా కిసాన్ డ్రోన్స్ స్ప్రేయింగ్ సర్వీస్ వారు తీసుకొచ్చిన డ్రోన్స్ పనితీరును స్వయంగా పరిశీలించినట్లు తెలిపారు. ఎండాడ త్రిబుల్ ఆర్ సెంటర్‌ను ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలానికి రక్షణ గోడను వెంటనే నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆ స్థలం వద్ద వున్న అనధికార బడ్డీలను వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎఎంఒహెచ్ సురేష్, టిపిఒ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.


పార్క్ పనులను పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్

అప్పన్న నిత్యాన్నదానానికి 35 ఏళ్లు

త్వరలో ఆన్‌లైన్ విరాళాల స్వీకరణ

ఈవో శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి- సింహాచలం : సింహాచలం శ్రీ వరహాలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకం 35 ఏళ్లు పూర్తి చేసుకుంది. బుధవారం నాడు 36వ వసంతంలోకి అడుగు పెట్టింది. ఈ సందర్భంగ ఆలయ అర్చక వర్గాలు అన్నదానం భవనంలో ఈవో సింగాల శ్రీనివాస్ మూర్తి దంపతులచే ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు ఈవో దంపతులతో పాటు ఏఈవోలు నక్కాన ఆనంద్ కుమార్, పాలూరి నర్సింగరావు, దేవస్థానం మాజీ ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు చేతులు మీదుగా ప్రత్యేక ఆహార పదార్థాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఈవో పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రస్తుతం దేవస్థానం నిత్యాన్న దాన పథకానికి రూ.35 కోట్లా 55 లక్షలకుపైగా డిపాజిట్లు ఉన్నట్లు చెప్పారు. భక్తులు సమర్పించిన విరాళాలను బ్యాంకుల్లో భద్రపరిచి తద్వారా వచ్చే వడ్డీ ఆదాయంతో నిత్యాన్న దాన భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. త్వరలోనే ఆన్‌లైన్‌లో కూడా భక్తుల నుంచి విరాళాలు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులకు మెరుగైన భోజన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నిత్యాన్నదాన పథకాన్ని కొనసాగిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం మధ్యాహ్నం, రాత్రిపూట భక్తులకు అన్నప్రసాదం అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

ఇవిఎం గోదాములను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - అరిలోవ : చినగదిలి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా బుధవారం ఉదయం గోదాముల వద్దకు వెళ్లిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీళ్లను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. భద్రతా ప్రమాణాలను పాటించాలని, అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట స్థానిక రెవెన్యూ అధికారులు, ఎన్నికల సెల్ అధికారులు ఉన్నారు.

రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : భారత్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యాన హర్యానా లోని రొహతక్‌లో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన మండలంలోని చిప్పాడ జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని కొసన ఆదిలక్ష్మిని అభినందిస్తూ సన్ స్కూల్ అధినేత కె.శ్రీనివాసరావు బుధవారం రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతిని చెక్కు రూపంలో అందజేశారు. సెప్టెంబర్‌లో జరుగనున్న అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో ఈమె పాల్గొనున్నట్లు తెలిపారు. కోచ్ వాసుపల్లి ఆదినారాయణ ప్రోత్సాహంతో గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించినట్లు వివరించారు. ఈమె మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్రప్రదేశ్ ఆమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 11, 12 తేదీలలో తిరుపతి శ్రీవెంకటేశ్వర స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన 9వ ఇంటర్ స్టేట్స్ ఇన్విటేషన్ తైక్వాండో పోటీల్లో మధురవాడ ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్ క్లబ్ క్రీడాకారులు పలు పతకాలు గెలుచుకున్నారు. క్యాడెట్ 12 నుంచి 14 సంవత్సరాల కేటగిరిలో పి.వెంకటేష్ బంగారు పతకం, 41 కిలోల విభాగంలో ఎస్‌కె.హరీఫ్ రజత పతకం, గెలుపొందగా జూనియర్ 15 నుంచి 17 సంవత్సరాల బాలుర కేటగిరి 41 కిలోల విభాగంలో ఎస్.నిఖిల్, 49 కిలోల లో పి.దుర్గా ప్రసాద్, 55 కిలోల విభాగంలో ఎస్‌కె.రజక్, బాలికల కేటగిరీ 53 కిలోల విభాగంలో పి.సాయిభార్గవి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. విజేతలను తైక్వాండో గ్రాండ్ మాస్టర్ కెవి.బాబూరావు, ఇంటర్నేషనల్ రిపరీ సుదర్శన్, విజేతలకు శిక్షణ ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఆనందరావు అభినందించారు.

రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌కు స్వాగతం

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఉత్తరాంధ్ర గీత సహకులాల యువజన సంఘం అధ్యక్షుడు ఏకుల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యాన బుధవారం విశాఖపట్నం విమానాశ్రయంలో స్వాగతం పలికారు. మొదటిసారిగా విశాఖపట్నం విచ్చేసిన సందర్భంగా ఆయనకు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం సత్కరించారు. స్వాగతం పలికిన వారిలో సంఘం నాయకులు జుత్తుక రాజు, చుక్క గణేష్, పెంట సురేష్, ఎస్.ప్రసాద్, పడాల శ్రీనివాసరావు, వి.రామారావు, ఎస్.అప్పారావు ఉన్నారు.


రెవెన్యూ మంత్రికి స్వాగతం పలుకుతున్న వెంకటేష్ తదితరులు

ఆక్రమణ స్థలాన్ని పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి-యంత్రాంగం

వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధి గంగిరెడ్ల కాలనీలో ఆక్రమణకు గురైన స్థలాన్ని పెందుర్తి తహశీల్దార్ వేణుగోపాల్ బుధవారం పరిశీలించారు. కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి, ప్రాథమిక పాఠశాల వంటశాల, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సర్వే నెంబర్ 75లో సుమారు 300 గజాల స్థలాన్ని గతంలో కేటాయించారు. ఆ స్థలాన్ని పాఠశాల విద్యార్థులు వాడుకుంటున్నారు. ఇటీవల కాలంలో స్థానికులు ఇద్దరు ఆ స్థలాన్ని ఆక్రమించి గుడిసెలు వేశారు. దీనిపై అధికారులకు మాజీ కార్పొరేటర్ రాపర్తి శైలజ ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీనిపై హైకోర్టులో కేసు వేశారు. కేసును విచారించిన న్యాయస్థానం ఆరు వారాల్లో విచారణచేసి సదరు స్థలాన్ని పాఠశాల యాజమాన్యానికి అప్పగించాలని ఆదేశించడంతో బుధవారం పెందుర్తి తహశీల్దార్ విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కబ్జా స్థలాన్ని పరిశీలించిన విఆర్ఒ

పెందుర్తి : మండలంలోని జెర్రిపోతుల పాలెం గ్రామంలో సర్వే నెంబర్ 420లో చెరువు కబ్జాకు గురైందని సర్పంచ్ మడక అప్పలరాజు పలుమార్లు తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ వేణుగోపాల్ ఆదేశాల మేరకు విఆర్ఒ గాలి పేతురు, సచివాలయ సిబ్బంది, విఆర్ఎ బుధవారం కబ్జా స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడున్న స్థితిని తహశీల్దార్‌కు నివేదిస్తామని విఆర్ఒ చెప్పారు.

పశువుల ఆసుపత్రికి ప్రహరీ నిర్మిస్తాం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని కొవ్వాడ గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామీణ పశువైద్యశాలకు త్వరలో ప్రహరీ నిర్మిస్తామని, ఆసుపత్రికి రంగులు కూడా వేయిస్తామని పొండ్రంగి పశు వైద్యాధికారి ఎ.వాసు తెలిపారు. 'పశువైద్యం దూరాభారం' శీర్షికన ప్రజాశక్తిలో బుధవారం ప్రచురితమైన కథనానికి పశు వైద్యశాఖాధికారులు స్పందించి ఒక ప్రకటన విడుదలచేశారు. కొవ్వాడ పశువైద్యశాలకు సంబంధించి మూడు సర్వీసు సెంటర్లు పనిచేస్తున్నాయని తెలిపారు. కొవ్వాడలో గ్రామీణ పశువైద్య కేంద్రం, గంధవరంలో రైతు సేవా కేంద్రం, అనంతవరంలో గోపాలమిత్ర సేవా కేంద్రం పనిచేస్తున్నట్లు వివరించారు. పశు వైద్యకేంద్రానికి మూడు నుంచి 4 కిలో మీటర్ల దూరంలో గ్రామాలు ఉన్నాయని తెలిపారు. గంధవరం రైతు సేవా కేంద్రంలో ఉన్న పశుసంవర్ధకశాఖ సహాయకులు 6 నెలలుగా గైర్హాజరులో ఉన్నారని, సిబ్బంది కొరత ఉందని వివరించారు.

సమయపాలన, నైపుణ్యం అవసరం

ప్రజాశక్తి-మల్కాపురం : నిర్ణయాలు తీసుకునే శక్తి, సమయపాలన, వృత్తి, భాషాపరమైన నైపుణ్యాలు ఎంతో అవసరమని ఆంధ్ర విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథక ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ డాక్టర్ సర్వసిద్ధి హరనాథ్ పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో బుధవారం నూతన విద్యార్థినుల స్వాగత సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. కళాశాలలో నూతనంగా చేరిన వారు ముందుగా తమ నైపుణ్యాలకు పదును పెట్టుకోవాలన్నారు. అవకాశాలను సృష్టించుకుంటూ విజయాలను సొంతం చేసుకోవాలని సూచించారు. విద్యా సంబంధ విషయాల్లోనే కాకుండా, జాతీయ సేవా పథకంలో, క్రీడలలో, మేధోపరమైన పోటీలలో పాల్గొని వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకోవాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అధ్యక్షతన సాగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ గెసెల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ కేష్టిన్, అధ్యాపకులు, సీనియర్ విద్యార్థినులు మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు ప్రిన్సిపల్ బహుమతులను అందించి అభినందించారు. అనంతరం ముఖ్య అతిథి సర్వసిద్ధి హరినాథ్‌ను సత్కరించారు.

28న పోర్టు సమ్మెను జయప్రదంచేయాలి

ప్రజాశక్తి-మాధవధార : పెండింగ్‌లో ఉన్న బిడబ్ల్యుఎన్‌సి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28వ తేదీన మేజర్ పోర్టుల్లో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు పిలుపునిచ్చారు. మాధవధార కళింగనగర్‌లోని సిపిఐ కార్యాలయంలో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌదరి అప్పారావు మాట్లాడుతూ, పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ పిపిపి విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, పింఛన్‌దారులందరికీ మెరుగైన వైద్య సదుపాయం అందించాలని డిమాండ్ చేశారు. పిపిపి విధానంతో పింఛన్‌దారులు వైద్యంలో ఇబ్బందులను ఎదుర్కొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పులి శివప్రకాశరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నెపు నారాయణరావు, అధిక సంఖ్యలో పోర్టు పింఛన్‌దారులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్ బారిన పడొద్దు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-సీతమ్మధార : యువత డ్రగ్స్ బారిన పడొద్దని డివైఎఫ్ఐ నాయకులు విజ్ఞప్తిచేశారు. ద్వారకానగర్ శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాలలో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, దేశ భవిష్యత్, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉందన్నారు. దేశం వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేధస్సు, నైపుణ్యం అవసరమన్నారు. దేశం ఔన్నత్యాన్ని నిలబెట్టగల శక్తి సామర్థ్యాలు యువత సొంతమని చెప్పారు. నేటి యువత తమ కర్తవ్యాన్ని విస్మరించి మత్తులో తేలియాడి జ్ఞానాన్ని, విచక్షణను, శక్తిసామర్థ్యాలను కోల్పోయి నిర్వీర్యమై, నిస్తేజంగా మారుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గంజాయి, డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువశక్తి పెడదారి పడుతుందన్నారు. యువతను మత్తులో ముంచి చిత్తు చేసే గంజాయి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు చేస్తున్న కృషి ఫలించడం లేదన్నారు. సకల అనర్థాలకు, హత్యలకు ప్రేరణగా నిలిచే గంజాయి, డ్రగ్స్ వాడకాన్ని నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు మూర్తి, ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఎస్.రాజు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షుడు శ్రావణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అతిథి

ఒబిహెచ్ఎస్ కార్మికుల ధర్నా


డిఆర్ఎం ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న రైల్వే కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : సౌముక్ యాజమాన్యం ఎగ్గొట్టిన నాలుగు నెలల బకాయి జీతాలను తక్షణమే ఇవ్వాలని డిఆర్ఎం ఆఫీస్ వద్ద రైల్వే ఒబిహెచ్ఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, ఒ.అప్పారావు మాట్లాడుతూ, ఆగస్టు 15న స్వాతంత్రం వచ్చినందుకు సంబరపడాలో లేక సౌముక్ యాజమాన్యం నాలుగు నెలల జీతాలు ఎగ్గొట్టి పారిపోయినా పట్టించుకోని రైల్వే అధికారుల తీరుని చూసి ఏడవాలో అర్థం కావట్లేదన్నారు. నాలుగు నెలల జీతాల బకాయిల గురించి కార్మికులు గత రెండు నెలలుగా అడుగుతున్నా రైల్వే అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను దోపిడీ చేసేలా రైల్వే వ్యవస్థని మోడీ ప్రభుత్వం మార్చివేసిందని విమర్శించారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి రైల్వే అధికారులే రైల్వే పనులు చేయించడం కోసం బాధ్యత తీసుకోవాలని, ఈ మేరకు మోడీ ప్రభుత్వం రైల్వేలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైల్వేలో దోపిడీ పద్ధతి పోయేవరకు పోరాడుతామని, సౌముక్ యాజమాన్యం నాలుగు నెలల బకాయి జీతాలని ఇచ్చేవరకూ పోరాటం ఆపేది లేదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే కార్మికులు సిహెచ్.హరి, టి.రాము, టి.లక్ష్మణ్, వైడిఎస్ ప్రసాద్, పి.ప్రసాద్, ఎ.అప్పారావు, పి.శ్రీను, ఇ.రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు పోటీలు

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా పరిషత్ హైస్కూల్, గవర్నమెంట్ హైస్కూల్ నుంచి 25 మంది విద్యార్థులు హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా జెడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయులు సిహెచ్.జగదీష్, ఎం.జగన్నాధరావు వ్యవహరించారు. విజేతలకు ఆగస్టు 15న గ్రంథాలయ ఆవరణలో నిర్వహించే పతాకావిష్కరణ సందర్భంగా బహుమతులు అందచేస్తామని గ్రంథాలయాధికారి తెలిపారు.

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని అలవర్చుకోవాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : నేటి యువత స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని అలవర్చుకోవాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం జివిఎంసి ఒకటో వార్డు పరిధి చిట్టివలసలో స్వాతంత్ర్యోద్యమ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎందరో త్యాగధనుల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం లభించినట్లు తెలిపారు. ముందుగా విద్యార్థులకు వివిధ ఆటలు, పాటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, కళాకారులు పోతురాజు, పంపాన సూర్యనారాయణ, రామకృష్ణ, ఆటో కార్మిక సంఘం నాయకులు జి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్యోద్యమ వేడుకల్లో మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్

లిటిల్ కిడ్డీస్ ప్లే స్కూల్‌లో...

అరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి ఆదర్శనగర్‌లోని లిటిల్ కిడ్డీస్ ప్లే స్కూల్‌లో బుధవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. రెండు నుంచి ఐదేళ్ల వయసున్న చిన్నారులు స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో అలరించారు. సుభాష్ చంద్రబోస్, మహాత్మాగాంధీ, భరతమాత, భగత్‌సింగ్, ఝాన్సీ లక్ష్మి భాయి వంటి స్వాతంత్ర సమరయోధులతో పాటు ఇతర రాష్ట్రీయుల వేషధారణలో ముచ్చటగొలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ శకుంతల పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో, ఎంపిడిఒ, తహశీల్దార్, పోలీస్‌స్టేషన్, గ్రామ సచివాలయాలు, గ్రంథాలయాలు వద్ద ఏర్పాటుచేసే స్వాతంత్ర దినోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా త్రివర్ణ పతాకాలను తోరణాలుగా కడుతున్నారు. దీంతో ఒక పండగ వాతావరణం కనిపిస్తోంది.


రోడ్డుపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

గాజువాకలో ట్రాఫిక్ రద్దీ

ప్రజాశక్తి -గాజువాక : శ్రావణమాసం సందర్భంగా గాజువాకలోని బంగారు షాపులు గిఫ్ట్ ఆఫర్లు ప్రకటించడంతో గాజువాక ప్రజలు ఒక్కసారి బంగారు షాపులకు ఎగబడ్డారు. వచ్చిన ప్రజలు సెల్లార్లలో ఉండేలా బంగారు షాప్ యజమానులు ఏర్పాటుచేసినా ప్రజలు రోడ్లపైకి వచ్చారు. వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాలు కదలలేని పరిస్థితి నెలకొంది. అంబులెన్సులు కూడా వెళ్లే పరిస్థితి లేకుండా రోడ్డుపై పార్కింగ్ చేశారు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు స్పందించకపోవడంతో రోడ్లపై వాహనాలు మరింతగా బారులు తీరాయి. జిఆర్‌టి, వైభవ్, ఖజానా తదితర బంగారు షాపులు ఆఫర్లను ప్రకటించడంతో రద్దీ ఎక్కువైంది.


ఆందోళన చేస్తున్న కార్మికులు

ఎస్‌బిసి బ్రిడ్జి ద్వారా రాకపోకలకు అనుమతివ్వాలి

ప్రజాశక్తి -మూలగాడ : సర్దార్ వల్లభాయ్ పటేల్ బ్రిడ్జి మూసివేత కారణంగా ఎస్‌బిసి బ్రిడ్జి ద్వారా రాకపోకలకు అనుమతివ్వాలని కోరుతూ ఐఎన్‌సిఇ, ఎన్‌సిఇ యూనియన్ ఆధ్వర్యాన డాక్‌యార్డు విజయనగర్ గేట్ల వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాన్వెంట్ జంక్షన్ నుంచి సింధియా వైపు ప్రయాణ మార్గంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ బ్రిడ్జి పున నిర్మాణం కారణంగా మూసివేశారని, దీంతో ఎన్ఆర్ మీదుగా ప్రయాణం సాగించాల్సి రావడంతో 10 కిలోమీటర్ల దూరం పెరిగిందని తెలిపారు. ఆ రహదారిలో ప్రతి రోజూ ఎవరో ఒకరు ప్రమాదానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్‌బిసి వద్ద గల పెరలల్ బ్రిడ్జి ద్వారా రాక పోకలకు అనుమతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులతో పాటు కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో హక్కులకై పోరాటం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు
- ఆకట్టుకున్న ఎసిసి, సిఐటియు స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్వాతంత్ర్యోద్యమం స్ఫూర్తితో హక్కులను కాపాడుకోవడానికి పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సిఐటియు, అనకాపల్లి చిల్డ్రన్ క్లబ్ (ఎసిసి) ఆధ్వర్యంలో బుధవారం అనకాపల్లిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ, ఆశా, మున్సిపల్ కార్మికులు, వారి పిల్లలు దేశభక్తి గీతాలు ఆలపించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో పాల్గొన్న సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం అనేకమంది ప్రాణాలు అర్పించారని తెలిపారు. కాని ఆ ఫలాలు నేటికీ ప్రజలకు అందలేదన్నారు. నేటి పాలకులు కులం, మతం పేరుతో ప్రజల మధ్య చీలికలు తీసుకొస్తున్నారన్నారు. నాడు కులమతాలకు అతీతంగా ప్రజలందరూ బ్రిటిష్ వాడిని దేశం నుంచి వెళ్లగొట్టారని, అదే స్ఫూర్తితో కుల, మత విద్వేషాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం


బహుమతులు అందజేస్తున్న సిహెచ్.నర్సింగరావు


కళా ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

సాంస్కృక ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులు, కళాకారులకు నర్సింగరావు చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, రొంగలి రాము, జయం నాయుడు, కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డిడి వరలక్ష్మి రైతు సంఘం నాయకులు జి నాయుడు బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రమణ, నాయకులు వెంకటేష్, భీశెట్టి అప్పారావు, నిమ్మకాయల అజయ్, డి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల బాటలో పయనిద్దాం

హర్ ఘర్ తిరంగా ర్యాలీలో కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపు


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

దేశ స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి బాటలో పయనిద్దామని, వారిలాగే భావితరాలకు స్ఫూర్తిగా నిలుద్దామని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి నెహ్రూ చౌక్ మీదుగా తిరిగి ఎన్టీఆర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సమయంలో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ చేశారు. భారత్ మాతాకీ జై, హర్ ఘర్ తిరంగా అంటూ నినదిస్తూ మువ్వెన్నల జెండా చేత బట్టి ముందుకు సాగారు. ముందుగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎఎస్పి కె.విజయభాస్కర్ జెండా ఊపి హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ దేశ ప్రయోజనాలు, సమాజ హితం కోసం అంకితభావంతో ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ చిన్నికృష్ణ, డిఎఫ్ఓ లక్ష్మణరావు, డిఇఓ వెంకట లక్ష్మమ్మ, డిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి మంజులవాణి, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెండాలు, మొక్కలు పంపిణీ

బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి గ్రామ పంచాయతీలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ బుధవారం నిర్వహించి, మానవహారం చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటికి జాతీయ జెండాలు, ఇంటి ముందు నాటేందుకు మారేడు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచార్య, స్థానిక నాయకులు కోరుకొండ రవికుమార్, గంటల అప్పలనాయుడు, కోరుకొండ అప్పలనాయుడు పాల్గొన్నారు.

1500 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

దేవరాపల్లి : ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో దేవరాపల్లి హైస్కూల్ నుండి రామాలయం వరకు 1500 అడుగుల భారీ జాతీయ జెండా ప్రదర్శిస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై అనే నినాదం మారుమోగింది. ఈ కార్యక్రమంలో విషా సంస్థ జిల్లా కన్వీనర్ సాయి లోహిత్, వేదిక జిల్లా అధ్యక్షుడు కెవి.రమణ, ఉపాధ్యక్షుడు కొరుపోలు శ్రీను, సభ్యులు గంగవంశం సంతోష్, ఉప్పు అజయ్ కుమార్, గుళ్ళిపల్లి రవి, కొల్లు యశ్వంత్, కోరుప్రోలు ఆది పాల్గొన్నారు.

బాలికల థింసా నృత్యం

కశింకోట : స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా కశింకోట బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గిరిజనుల నృత్యం థింసాను ప్రదర్శించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.ఎస్.స్వర్ణ కుమారి, పిడి పెంటకోట కమల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటిపై జాతీయ జెండా ఎగరేసిన మురళి

అనకాపల్లి : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తెలుగు యువత అనకాపల్లి జిల్లా ఆధికార ప్రతినిధి బొడ్డేడ మురళి పట్టణంలో తన ఇంటిపై బుధవారం జాతీయ జెండాను ఎగరవేశారు. ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను ఇళ్లపై ఎగురవేయాలని కోరారు.

జాతీయస్థాయిలో ఉత్తమ అంగన్వాడీ కార్యకర్తగా రమణమ్మ ఎంపిక


అంగన్వాడీ రమణమ్మ

ప్రజాశక్తి-సబ్బవరం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో ఉత్తమ అంగన్వాడీ కార్యకర్తగా మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామానికి చెందిన రావిపల్లి రమణమ్మ ఎంపికైనట్లు స్థానిక ఐసిడిఎస్ సిడిపిఓ లలిత కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 15న ఢిల్లీలో జరుగుతున్న స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొని ఉత్తమ అంగన్వాడీ కార్యకర్త అవార్డును అందుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రమణమ్మను సబ్బవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగనవాడీ కార్యకర్తలు, సిబ్బంది అభినందించారు.

16న వికలాంగులకు ఎంఎస్ఎంఇపై సదస్సు

ప్రజాశక్తి చోడవరం

చోడవరం వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఇపై ఈ నెల 16న శుక్రవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు దుగ్గిరాల రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో సామర్థ్యాల పెంపు, రుణాల ఏర్పాటు తదితర విషయాలపై ఎంఎస్ఎంఇ జాయింట్ డైరెక్టర్ అప్పికొండ శ్రీనివాస్, ఇతర అధికారులు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. స్థానిక కో-ఆపరేటివ్ కాలనీ కోనాం గెస్ట్ హౌస్ వద్ద గల వికలాంగుల కార్యాలయం (ఆదివాసీ రైతుల వ్యవసాయ ఉత్పత్తుల కంపెనీ) నందు జరుగుతుందని తెలిపారు. దీనికి వికలాంగులందరూ హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9963157557 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

టైలరింగ్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

ప్రజాశక్తి-చోడవరం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎపిఎస్ఎస్‌డిసి స్కిల్ హబ్ ద్వారా టైలరింగ్, కంప్యూటర్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్‌కుమార్, స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ వి.అప్పలనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వబడతాయని, వాటితో ఉద్యోగాలు పొందడానికి అర్హత కలిగి ఉంటారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థినీ విద్యార్థులు తమ ఆధార్ ధ్రువపత్రంతో కళాశాల ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్‌ను సంప్రదించాలని, మరిన్ని వివరాల కోసం 9494791935 ఫోన్ చేయాలని కోరారు.

వర్క్ అడ్జస్ట్‌మెంట్ షెడ్యూల్ వాయిదా వేయాలని వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఈ 17న ఎస్ఎంసి ఎన్నికల కారణంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్ షెడ్యూల్‌ను వాయిదా వేయాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో ఎం. వెంకట లక్ష్మమ్మకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 17వ తేదీన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. అదే రోజు రాష్ట్ర విద్యా శాఖ, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, వర్క్ అడ్జస్ట్ మెంట్ షెడ్యూల్ ప్రకటించారని, కాబట్టి 17న జరగనున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నేపథ్యంలో వర్క్ అడ్జస్ట్ మెంట్ షెడ్యూల్‌ను వాయిదా వేయాలని కోరారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సదరు విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జీవన్ ప్రకాష్, సీనియర్ నాయకులు దేముడు నాయుడు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎకోమాలో శిక్షణకు 52 మంది మహిళలు ఎంపిక

ప్రజాశక్తి-అచ్చుతాపురం : ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఎకోమా టైర్ల పరిశ్రమలో శిక్షణకు 52 మంది మహిళలు ఎంపికైనట్లు ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి మధు తెలిపారు. ఇంటర్వ్యూలకు 86 మంది మహిళలు హాజరు కాగా వారిని ఎకోమా పరిశ్రమ ప్రతినిధులు శ్రవణ్ కుమార్ బాలాజీలు ఇంటర్వ్యూలు చేశారు. ఎంపికైన మహిళలను, పరిశ్రమ ప్రతినిధులను ప్రశాంతి విద్యాసంస్థల ఛైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ అభినందించారు.

స్వాతంత్ర్య దినోత్సవ కవి సమ్మేళనం


కథ సంపుటిని ఆవిష్కరణ కవులు, రచయితలు

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం అనకాపల్లి సాహితీమిత్రుల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ గొంతిన రంగబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్కోజు రాజా గణేష్ రచించిన ఒకే వితర్నం- మూడు మొలకలు కథా సంపుటిని డాక్టర్ చక్రపాణి ఆవిష్కరించారు. ఆ పుస్తకంలో కథలను సమీక్షించారు. అనంతరం రచయిత రాజా గణేష్‌ని సత్కరించారు. జివిఎస్‌కె.సాయిబాబా కథల పుస్తకం "తాతమ్మ కథలు" పుస్తకాన్ని మాధవీ సనారా, జివిఎల్ఎన్.శాస్త్రి పుస్తకం "స్పర్శ" కవితలను గూర్చి రంగబాబు పరిచయం చేశారు. భారత స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తి సందర్భంగా కవిసమ్మేళనంలో కవులు మాధవీ సనారా, డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి, జివిఎస్‌కె. సాయి బాబా, కర్రి మల్లీశ్వరి, గంపా శ్రీదేవి, డి.వి.ఎల్.నారాయణ, జివిఎల్ఎన్.శాస్త్రి, షేక్ భాషా తమ కవితలు వినిపించారు. ఈ సమావేశంలో కొరాడ అప్పలరాజు, బళ్ళా నాగభూషణం, గ్రంథాలయ పాలకులు కె.శ్రీనివాస్, వజ్రపు త్రినాధరావు, పెతకంశెట్టి ఆదికోటి, డాక్టర్ పృథ్వీరాజ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో జనసేనలో చేరిన పద్మజ, అప్పారావు

బార్క్ అదనపు భూ సేకరణ అడ్డగింత

22ఎ నుంచి తమ భూములను మినహాయించాలని దొప్పెర్ల గ్రామస్తులు, అఖిలపక్ష నేతల డిమాండ్

ప్రజాశక్తి -అచ్యుతాపురం

బార్క్‌కు అదనపు భూ సేకరణ నిమిత్తం మండలంలోని దొప్పెర్ల గ్రామానికి వచ్చిన ఎపిఐఐసి డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనుబాబు, రెవెన్యూ, సర్వే సంబంధిత అధికారులను అఖిలపక్ష పార్టీల నాయకులు, ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ సాగులో ఉన్న భూములను 22ఎలో పెట్టడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే ఆ భూములను 22ఎ నుండి మినహాయించాలని వారు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఎటువంటి అదనపు భూ సేకరణ పనులు చేపట్టరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దొప్పెర్ల గ్రామ సర్పంచ్ కె.చిన్నారావు మాట్లాడుతూ బార్క్‌కు రహదారి వేయటానికి దొప్పర్ల, దోసూరు, రావిపాలెం గ్రామాలకు చెందిన వెయ్యి ఎకరాల భూములను 22ఎలో అప్పటి అధికారులు పెట్టారని తెలిపారు. రహదారి నిమిత్తం 80 ఎకరాల్లో నిర్మాణ పనులు చేశారన్నారు. మిగిలిన 920 ఎకరాలు 22ఎలో నుంచి మినాహాయించి క్రయ విక్రయాలకు అనుకూలంగా రికార్డులు చేయాల్సిన అధికారులు, నిర్లక్ష్యంతో తమకు పట్టనట్లు వదిలిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో 15 సంవత్సరాలుగా కుటుంబ సమస్యలు, పిల్లల పెళ్ళిళ్ల నిమిత్తం అమ్ముకోవడానికి అనుమతులు లేకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరు ఎమ్మెల్యేలు మారినప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. 920 ఎకరాల భూములను 22ఎ నుంచి మినహాయించి వెంటనే రికార్డులు తయారు చేసి తమకు మోక్షం కల్పించాలని డిమాండ్ చేశారు. సేకరించిన భూములకు కొంతమంది రైతులకు నేటికీ పరిహారం చెల్లించలేదని తెలిపారు. తమ గ్రామాల్లో భూములు సేకరించినప్పటికీ సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం లేదని పేర్కొన్నారు. బార్క్, రెవెన్యూ, ఎపిఐఐసి అధికారులు కలిసి తమ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పల్లి వెంకటరావు, పల్లి శేషగిరిరావు, రైతులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న దొప్పెర్ల గ్రామస్తులు, నాయకులు

దోసూరు ఎంపిటిసి పద్మజ జనసేనలో చేరిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దోసూరు ఎంపీటీసీ సభ్యురాలు రాజాన పద్మజ, ఆమె భర్త అప్పారావు బుధవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే జనసేన పార్టీ కండువాను వేసి పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బి రాందాస్, కార్యకర్తలు పవన్ సాయి, లాలం చందు, ద్వారపురెడ్డి బాబ్జి, చిన్ని పంతులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు, ఎస్‌పికి జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని, జిల్లా కేంద్రంలో ఏపీయూడబ్ల్యూజే భవనానికి ఐదు సెంట్లు స్థలం, నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పెంటకోట జోగినాయుడు, కోరాడ చంద్రరావు, మద్దాల రాంబాబు, ఎల్లపు వెంకటరమణాజీ, చాగంటి సర్వారావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఈ వర్షంతో సేద తీరారు. కొద్ది రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయి. ఈ భారీ వర్షం రెండు వారాలు ముందు వేసిన సరుగుడు, నీలగిరి మొక్కలు, కూరగాయలు తోటలకు ఎంతో ఉపపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

కెజిబివి ప్రహరీపై ఫెన్సింగ్ నిర్మాణానికి రూ.20 వేలు విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం రక్షణ కోసం ప్రహరీ గోడపై ఫెన్సింగ్ నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన జనసేన జిల్లా సీనియర్ నాయకులు బలిరెడ్డి అప్పారావు రూ. 20వేలు విరాళం బుధవారం ప్రిన్సిపాల్ మృదులకు అందజేశారు. ఈ మేరకు బలిరెడ్డి అప్పారావుకు కేజీబీవీ సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వినాయక చవితి ఉత్సవ రాట

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక స్వయంభూ శ్రీవిఘ్నేశ్వర స్వామి ఆలయంలో రాబోవు వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ రాటను స్థానిక శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్ రాజు బుధవారం వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సత్యనారాయణ, ఆలయ కమిటీ ఛైర్మన్ ఉప్పల సతీష్, శ్రీరామ్‌మూర్తి రాజు, కార్యనిర్వహణాధికారి ఎస్‌వివి.సత్యనారాయణ మూర్తి, అర్చకులు కొడమంచిలి చలపతిరావు, కొడమంచిలి శ్రీనివాస్, సంగీస విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



రాట వేస్తున్న ఎమ్మెల్యే రాజు

సమస్యల పరిష్కారానికి కృషి

మండల పరిషత్తు సమావేశంలో ఎంపిపి కలగా లక్ష్మి



మాట్లాడుతున్న ఎంపిపి కలగా లక్ష్మి

ప్రజాశక్తి -కశింకోట

గామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎంపిపి కలగా లక్ష్మి అన్నారు. మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి లక్ష్మి అధ్యక్షతన జరిగింది. జె.తుని ఎంపీటీసీ దర్గా మాట్లాడుతూ గృహాలపై నుండి వేసిన విద్యుత్ వైర్లను తొలగించాలని కోరారు. కొత్తపల్లి ఎంపిటిసి బుదిరెడ్డి అప్పుడు మాట్లాడుతూ తమ గ్రామంలో భూములు సర్వే చేయాలన్నారు. కశింకోట ఎంపీటీసీ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇంచార్జి తహశీల్దారు సురేష్ నాయుడు, మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పావని మాట్లాడుతూ మండలంలో 8 మంచినీటి ట్యాంకుల నిర్మాణానికి రూ.96 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. పల శాఖల అధికారులు పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, ఎంపీడీఓ శేషు బాబు, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి -సబ్బవరం

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏల సంఘం జిల్లా కార్యదర్శి నీటిపల్లి గంగాధర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యాన బుధవారం పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబుని విశాఖపట్నంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 వేల మంది వీఆర్ఏలు గ్రామాల్లో రెవెన్యూ సేవలు అందిస్తున్నారని, వీరు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పుడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం మాట ఇచ్చి వీఆర్ఏ వ్యవస్థను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం వీఆర్ఏ వ్యవస్థను రెగ్యులర్ చేసిన విధంగా ఎపిలోనూ కూటమి ప్రభుత్వం చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ జిల్లా కోశాధికారి ఎన్ సంతోష్, సబ్బవరం, పరవాడ, పెందుర్తి వీఆర్ఏలు ఉన్నారు.



ఎమ్మెల్యే పంచర్ల రమేష్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న విఆర్ఎలు

బొత్సకు పైలా శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పరవాడ : ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక కానున్న సందర్భంగా బుధవారం విశాఖపట్నంలోని ఆయన స్వగృహంలో వైసిపి సిఇసి సభ్యులు పైలా శ్రీనివాసరావు కలిసి పూలబొకే అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇది వైసీపీ పూర్వ వైభవానికి నాంది అని పేర్కొన్నారు. చట్ట సభల్లో ఆంధ్ర ప్రజల, రాష్ట్ర భవిష్యత్తుపై ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ తనగళం వినిపించాలని కోరారు.



బొత్సకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పైలా శ్రీనివాసరావు

మోడల్ స్కూల్ రోడ్డును పునర్నిర్మించాలని వినతి

ప్రజాశక్తి- మునగపాక : మండలంలోని పాటిపల్లి గ్రామంలో గల ఏపీ మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు మార్గం శిథిలమైందని, దానిని పునర్నిర్మించాలని కోరుతూ ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌కు ఇన్చార్జ్ ప్రిన్సిపల్ పీలా ఆశ, సిబ్బంది బుధవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆశ మాట్లాడుతూ మోడల్ స్కూల్‌కి వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా శిథిలమై రాళ్లు తేలి ఉండడంతో పాఠశాలకు సైకిళ్లపై వస్తున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలకు సంబంధించిన గర్ల్స్ హాస్టల్లో సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్లేగ్రౌండ్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే పై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు హీరాలాల్, ఉమామహేశ్వరరావు, నూతన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

ప్రజాశక్తి- మునగపాక : మండలంలోని నాగులపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మల్ల అప్పలనాయుడు (చినబాబు) జ్ఞాపకార్థం నాగులపల్లి జిల్లా పరిషత్ హైస్కూలుకు ఆయన కుమారుడు మల్ల భవాని శంకర్ మైక్ సెట్ వితరణ చేశారు. ఆ పాఠశాల విద్యార్థులకు 300 పుస్తకాలు, 310 పెన్నులను స్కూల్ ప్రధానోపాధ్యాయులు శంకర్రావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్ల చంద్రశేఖర్, హరిప్రసాద్, మల్ల ఉమామహేశ్వరావు, ఎంపీటీసీ మల్ల కాశి సురేష్, మల్ల సంతోష్, మల్ల దొరమ్మ నాయుడు, ఉపాధ్యాయులు భాస్కర్ రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎమ్‌లే జెండా ఆవిష్కరణ చేయాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, పాఠశాల విద్యా కమిటీల ఎన్నికలు నేపథ్యంలో గురువారం పాఠశాలల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జెండా ఆవిష్కరణ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చేయాలని ఎంఇఒ బి.కాశి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

హత్యాచారంపై సమగ్ర దర్యాప్తు జరపాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : కోల్‌కతాలోని ఆర్జీకార్ ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు, వైద్యులు విధులను బహిష్కరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నారని, ఫలితంగా నిందితుడిని పట్టుకున్నప్పటికీ కళాశాల యాజమాన్యం, పోలీసుల నిర్లక్ష్యం సహించరానిదని పేర్కొన్నారు. యువ వైద్యురాలిపై అత్యాచారం జరిగిన తీరు, నిందితుడి ఉన్మాద వైఖరి దృష్ట్యా ఈ ఉదంతం దేశమంతటిని కదిలించిందని పేర్కొన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించడంతోపాటు ఆస్పత్రులలో పని చేసే సిబ్బందికి రక్షణ కల్పించేలా పటిష్టమైన చట్టాలకు రూపకల్పన చేయాలని, కేసును సిబిఐకి అప్పగించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

ఎస్‌సి వర్గీకరణపై పునరాలోచించాలి



కొవ్వుత్తులతో నిరసన చేస్తున్న అంబేద్కర్ యూత్

ప్రజాశక్తి -కొత్తకోట : ఎస్‌సి వర్గీకరణ తీర్పుపై సుప్రీంకోర్టు పునరాలోచన చేయాలని కోరుతూ రావికమతం మండలం కొత్తకోట అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం రాత్రి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో కొవ్వొతులతో నిరసన చేపట్టారు.. ఈ సందర్భం గా సంఘం సభ్యులు పలువురు మాట్లాడుతూ ఎస్‌సిలలోని మాల, 16 ఉపకలాలకు నష్టం కలిగించే ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు నిర్ణయం వెనక్కు తీసుకోవాలని, ఈ మేరకు రాష్ట్రాలకు తగు చేయాలని డిమాండ్ చేశారు లేకుంటే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంబేద్కర్ సంఘం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆరిలోవ టేకు ప్లాంటేషన్ పరిశీలన



టేకు ప్లాంటేషన్ సందర్శిస్తున్న రీసెర్చ్ సెంటర్ రేంజ్ అధికారి

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఉన్న టేక్ ప్లాంటేషన్‌ను బుధవారం విశాఖపట్నం రీసెర్చ్ సెంటర్ రేంజ్ అధికారిని దీప్తి సందర్శించారు. 2006లో నాటిన టేకు ప్లాంటేషన్ ఎదుగుదలపై పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. అప్పట్లో ఐదు రకాలైన టేకు స్టంపులను ఈ ప్లాంటేషన్‌లో నాటడం జరిగిందన్నారు. నాటిన ఐదు రకాలలో ఎంత మేర పెరిగిందో పరిశీలించి వాటిలో ఎదుగుదల కలిగిన టేక్ దుంపలను కొత్త ప్లాంటేషన్‌లో వేసే విధంగా పరిశోధనలు చేస్తున్నామన్నారు. . అలాగే మరో ప్లాంటేషన్ పెడిమికొండ ప్రాంతంలో పరిశీలిస్తామని తెలిపారు. రీసెర్చ్ సెంటర్ డిఆర్‌ఒ పార్వతీశం, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్‌తో చిక్కులు!



ప్రమాదానికి గురైన రెవెన్యూ ఉద్యోగి సన్యాసిరాజు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల కేంద్రంలో మండల పరిషత్ ఎదురుగా ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదానికి గురై ప్రభుత్వ రెవెన్యూ ఉద్యోగి తీవ్రగాయాల పాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలివి. మండల పరిషత్ ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు నిలిచిపోతుండడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఇటీవల మండల పరిషత్ అధికారులు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేశారు. అయితే స్పీడ్‌బ్రేకర్ వద్ద బుధవారం కురిసిన వర్షానికి రోడ్డుపై నీళు భారీగాచేరాయి. కైలాసపట్నం గ్రామానికి చెందిన ప్రభుత్వ రెవెన్యూ ఉద్యోగి సన్యాసిరాజు ద్విచక్ర వాహనంపై వెళ్తూ, స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో సన్యాసిరాజుకు ఎడమకంటిపై తీవ్రగాయమైంది. బాధితుడిని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. స్థానిక వైద్యులు, సిబ్బంది సేవలు అందించారు. అయితే స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నయని పలుమార్లు స్థానికులు, నాయకులు సైతం అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రమాదానికి అదే కారణమంటున్నారు. సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు యోచిస్తున్నారు,

చుట్టుగెడ్డకు తారురోడ్డు నిర్మించరూ..!

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనం నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న చుట్టుగెడ్డ వాసులు

ప్రజాశక్తి - మాడుగుల: మండలంలో శంకరం పంచాయతీ శివారు చుట్టుగెడ్డ గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మించాలని కోరుతూ బుధవారం ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామానికి ఉన్న గ్రావెల్ రోడ్డు బురద కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణంపాలెం తారు రోడ్డు నుంచి గ్రావెల్ రోడ్డు మీదుగా చుట్టు గెడ్డ గ్రామాన్ని సందర్శించిన నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజన సంఘం బృందం, ముందుగా గిరిజనులతో మాట్లాడివారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తారు రోడ్డు నిర్మాణం చేయాలని నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ కృష్ణంపాలెం తారురోడ్డు నుండి చుట్టుగెడ్డ వరకు గ్రావెల్ రోడ్డు వేశారని, అయితే చుట్టుగెడ్డ నుండి కూర్మనాథపురం వరకు తారు రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేసారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చుట్టుగెడ్డ వరకు ఉన్న గ్రావెల్ రోడ్డు గుంతలు బురదమయం కావడంతో కృష్ణం పాలెం నుంచి కూర్మనాధపురం వెళ్లాలంటే చుట్టుగెడ్డ ప్రజలు కాశీపురం మీదుగా కోడూరు, చినకూర్మనాధపురం తారు రోడ్డు నుండి ద్వారకానగర్. కూర్మనాథపురం. వెళ్ళవలసి వస్తుందని, దీంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తంచేసారు. అత్యవసర వైద్యం, నిత్యావసరాలకు, అలాగే విద్య, వైద్యం ఇతరత్రా అవసరాలకు చుట్టుగెడ్డ గిరిజనం పడుతున్న ఇబ్బందులపై అనేకసార్లు అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా స్పందన లేదని వాపోయారు. ఇప్పటికైనా చుట్టుగెడ్డ గిరిజనంపై నిర్లక్ష్యం వీడి తారురోడ్డు నిర్మాణంతోపాటుఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జనపరెడ్డి కొండలరావు, నెల్లూరు కృష్ణ, అల్లంగి చిన్నారావు, కిల్లి బాలరాజమ్మ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు



బహుమతులను అందజేస్తున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : మాదక ద్రవ్యాలను నిరోధించేందుకు, యువతను అందులో భాగస్వామ్యులను చేయాలనే ఉద్దేశ్యంతో మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో బుధవారం నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్, డిగ్రీ విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ హాజరై ఈ పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో జడ్జి షియాజ్‌ఖాన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో సమాజం నాశనం అవుతుందన్నారు. యువత గంజాయి, సిగరెట్‌తో మొదలై హెరాయిన్, బ్రౌన్‌సుగర్, కొకైన్ వంటి మాదవ ద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యతును చేతులారా పాడుచేసుకుంటున్నారని కుటుంబాలకు, సమాజానికి భారంగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాజు, ఇతర సిబ్బంది వారిని అభినందించారు.

పతకాలు సాధించిన కిక్ బాక్సర్లకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : కిక్ బాక్సింగ్ పోటీల్లో నర్సీపట్నం క్రీడాకారులు పతకాలు సాధించారు. రాజమండ్రిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 2024లో స్థానిక ఆర్పీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన 18 మంది పాల్గొనగా 12 మంది క్రీడాకారులు విజయం సాధించి పతకాలు గెలుచుకున్నారు. విజేతలైన క్రీడాకారులకు ఆర్‌డిఒ హెచ్‌వి.జయరాం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆర్పి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ వెలగ నారాయణరావు, వైస్ చైర్మన్ పీవిఎం.నాగజ్యోతి, వ్యవస్థాపకులు ఆర్పి ప్రసాదు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ నాగజ్యోతి మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ముఖ్యంగా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా ఆత్మ రక్షణ, ధైర్య సాహసాలు అలవడతాయని తెలియజేశారు. గెలుపొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి తదుపరి జరిగే పోటీలలో కూడా పాల్గొని నర్సీపట్నానికి మరెన్నో బహుమతులు తీసుకురావాలని ఆశిస్తూ వారిని ఉత్సాహపరిచారు.

జగన్‌ను కలిసిన రాజ్యసభ సభ్యుడు బాబూరావు



జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బాబూరావు

ప్రజాశక్తి- నక్కపల్లి: తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని బుధవారం రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని తాజా రాజకీయ పరిస్థితులతోపాటు పలు అంశాలపై చర్చించారు. జగన్‌ను కలిసిన వారిలో బాబూరావు తనయుడు యువ నాయకులు గొల్ల సాయి కార్తికేయ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి ఉన్నారు

మూన్నాళ్ల ముచ్చట!

పెచ్చులూడుతున్న తారురోడ్డుతో పరేషాన్



అంచుల్లో పాడౌతున్న తారురోడ్డు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని ఎంకె.పట్నం ఆర్‌అండ్‌బి రోడ్డు మూడు నెలలకే ప్యాచీలు వేయడంతో స్థానికులు విమర్శిస్తున్నారు. ఎన్నికల ముందు ఆదరాబాదరాగా ఈరోడ్డును నిర్మించారు. గొలుగొండ మండలం ఏటిగైరంపేట నుంచి రోలుగుంట మండలం ఎంకె.పట్నం, బిబి,పట్నం, రత్నంపేట మీదుగా వడ్డిప ఆర్‌అండ్‌బి రోడ్డు వరకు రూ.2 కోట్ల 31లక్షల నాబార్డు నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఎన్నికల ముందు ఈ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మూడు కిలో మీటర్లు మేర రోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా, నిర్మాణదశలోనే నాణ్యత లోపించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసినా పట్టించుకోని పరిస్థితి. ఇపుడు రహదారి పొడుగునా అడుగడుగునా పెచ్చులు ఊడటంతో ఆయా గ్రామాల వైసిపి, టిడిపి నేతలు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి, నాసిరకంగా రోడ్డు నిర్మాణం చేపట్టిన వైనంపై చర్యలు చేపట్టాలని, వాటిని సరిచేసే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బొత్సను సత్కరించిన వీసం



బొత్సను సత్కరిస్తున్న రామకృష్ణ

ప్రజాశక్తి -నక్కపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్య నారాయణను బుధవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసీపీ నేత వీసం రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పోటీ చేయకపోవడం, ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసిన వ్యక్తి ఉపసంహరించు కోవడంతో బొత్స ఎన్నిక ఏకగ్రీవం కావడంపై హర్షం వెలిబుచ్చారు. విశాఖలో బొత్స సత్యనారాయణను కలిసిన వీసం కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

కుక్కల బెడద నివారించాలని వినతి



ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్.

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలంల తట్టబంద పంచాయతీలో వీధి కుక్కలు బెడద రోజు రోజుకూ ఎక్కువ అవుతుందని, దీని వల్ల గ్రామంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారనిగ్రామ సర్పంచ్ గోకివాడ రమణ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో కొన్నాళ్లుగా ఏ వీధిలో చూసినా గుంపు గుంపులుగా వీధి కుక్కలు సంచరిస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయన్నారు. కుక్కల దాడిలో ఇప్పటికే గ్రామంలో మేకలు, గొర్రెలు మృత్యువాత పడ్డాయన్నారు. ఒంటరిగా వీధుల్లోకి రావాలంటే భయపడే పరిస్థితులున్నాయని, ముఖ్యంగా చిన్నారులు వృద్ధులు, మహిళలు భయపడుతున్నారన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల ఏరివేత కార్యక్రమం చేపట్టాలని కోరుతూ ఎంపిడిఒ భానోజీ రావుకు సర్పంచ్ గోకివాడ రమణ వినతిపత్రం అందించారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా
సిపిఎం కాగడాల ప్రదర్శన



కాగడాలతో సిపిఎం నేతలు, స్థానికులు

ప్రజాశక్తి-నక్కపల్లి: 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నక్కపల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన చేశారు.స్వాతంత్ర్యం సిద్ధించి 78ఏళ్లు గడిచినా, నేటికీ స్వతంత్ర ఫలాలు అందరికీ దక్కలేదన్నారు. రోజురోజుకూ పేదిరికం, నిరుద్యోగం పెరుగుతోందని, స్వాతంత్ర సమరయోధులు ఆశించిన సమసమాజం నేటికీ కానరావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజల కష్టార్జితంతో నెలకొల్పిన ప్రభుత్వ రంగ పరిశ్రమలను పాలకులు ప్రైవేటీకరణ చేస్తున్నారని, దేశానికి అన్నం పెట్టే వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేయడానికి చూస్తున్నారని, ఇది దేశ ప్రతిష్ట, మనుగడకు తీవ్ర విఘాతం, నష్టం కలిగిస్తుందని తెలిపారు. భారత స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి ముందున్న తక్షణ కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కన్వీనర్ ఎం.రాజేష్, నాయకులు బి.రాము, ఎం.మహేష్ బాబు, కె.ప్రసాద్, వై.నవీన్, సిహెచ్.సోమేష్, ఎం.శ్రీనివాస్, కె.బుజ్జి, ఎం.బైరాగిరాజు పాల్గొన్నారు.

కనులపండువగా బాలోత్సవ్

- విచిత్ర వేషధారణలు, ఆటపాటలతో అలరించిన చిన్నారులు
- వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



బాలోత్సవలో విభిన్న వేషధారణలతో చిన్నారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : 78 వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా లయన్స్ క్లబ్ సహకారంతో నర్సీపట్నం బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వాసవి కళ్యాణ మండపంలో నిర్వహించిన పోటీల్లో చిన్నారులు అలరించారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన ఎల్‌కెజి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేషధారణ, చిత్రలేఖనం, బృంద గానం, వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బాలోత్సవ కమిటీ అధ్యక్షులు డాక్టర్ అధికారి గోపాలరావు బహుమతి ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో జరిగిన బాలోత్సవ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులకు 32 రకాల పోటీలు ఘనంగా నిర్వహించామన్నారు. ఇపుడు స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలల్లోని నైపుణ్యత, సామర్థ్యాలను వెలికి తీసి, వారిని ప్రోత్సాహించే లక్ష్యంతో బాలోత్సవ కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. పోటీల నిర్వహణకు సహకరించిన ఉపాధ్యాయులకు, నిర్వాహకులకు, ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ కార్యదర్శి కె.త్రిమూర్తులురెడ్డి, పి.రంగరాజు, శేషగిరిరావు, పివి రమణ వెంకటేశ్వరరావు, విశ్వనాథం, ప్రభాకర్, మురళీకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న బాలికలు



దేశభక్తి గీతాలాపనలో విద్యార్థినులు

విశాఖ మార్కెట్‌లోకి ఎల్‌జి ఒఎల్ఇడి టీవీ



ఎల్‌జి ఒఎల్ఇడి టీవీ ఆవిష్కరణలో యుగంధర్, తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఎల్‌జి తమ సరికొత్త సి4 సిరీస్ ఒఎల్ఇడి టీవీని విశాఖ మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్‌జి బ్రాంచ్ మేనేజర్ యుగంధర్ హాజరయ్యారు. ఈ నూతన ఎల్‌జి ఉత్పత్తిని సిరిపురంలోగల క్రోమా స్టోర్‌లో విడుదల చేస్తూ ఆయన మాట్లాడారు. టెక్నాలజీ, సాంకేతిక విభాగాల్లో ఎల్‌జి ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. వినియోగదారులకు నమ్మకమైన సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎల్‌జి రీజినల్ మార్కెటింగ్ హెడ్ ఫరీద్, ఏరియా మేనేజర్ నర్సిరెడ్డి, క్రోమా స్టోర్ మేనేజర్ వికాస్ పాల్గొన్నారు. 10 సంవత్సరాలుగా వినియోగదారులు తమకు నెంబర్ 1 స్థానాన్ని అందించి మరింత ముందుకు వెళ్లే ఉత్సాహన్ని అందించారని తెలిపారు.

ఊరూవాడా హర్ ఘర్ తిరంగా



నగరంలో 25వేల అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ మహిళా కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జరిగింది. వింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పాల్గొన్నారు. జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ఆమె మాట్లాడారు. ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి, ఎన్‌సిసి కేడెట్స్, ఎస్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ బి.హైమావతి, డాక్టర్ జె.లావణ్య, డాక్టర్ కెఎల్.శిరీష, అనురాధ, కళాశాల పీడీ డాక్టర్ ఆర్.కిరణ్మయి పాల్గొన్నారు.

25 వేల అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ

స్వాతంత్ర్య ఫలాలను అందించిన మహనీయులను స్మరించుకుని నివాళులు అర్పించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో బుధవారం సెంట్రల్ పార్కు సమీపంలోని మహిళా కళాశాల వద్ద జరిగిన 25 వేల అడుగుల భారీ జాతీయ పతాక ర్యాలీలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం, చిక్కాల విజయ్‌బాబు, స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ అధ్యక్షుడు బసవ కృష్ణమూర్తి, సుంకరి రమణమూర్తి, రిటైర్డ్ పోలీస్ అధికారి సి.మురళి నాయుడు, సన్ స్కూల్ డైరక్టర్ కె.శ్రీనివాస్, కొప్పుల రాంజీ, రాజగిరి విఠల్, ట్రాఫిక్ ఎసిపి ఎస్.వాసుదేవ్ పాల్గొన్నారు.



చీడికాడలో మోడల్ స్కూల్ విద్యార్థుల తిరంగా ర్యాలీ

నక్కపల్లి : స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని తహసీల్దార్ అంబేద్కర్, మండల పరిషత్ కార్యాలయ ఏవో సీతారామ రాజు, ఇఒపిఆర్‌డి సత్య నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉద్యోగులు సిబ్బందితో కలిసి జాతీయ జెండాతో హర్ ఘర్ తిరంగా నిర్వహించారు. ఆర్ ఐ కన్నబాబు పాల్గొన్నారు.

నక్కపల్లి : స్థానిక గురుకులంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రిన్సిపల్ కె.సువర్ణ రత్నకుమారి తెలిపారు. బుధవారం విద్యార్థులు చేసిన అక్షరమాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు కావడంతో 78, ఆగస్టు 15 ఆకారంలో విద్యార్థులు అక్షరమాలగా ఏర్పడిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.

చీడికాడ : జాతీయతాభావం, దేశభక్తిని ప్రతిబింబించేలా ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చీడికాడలోని ఎపి మోడల్ స్కూల్, కాలేజీ విద్యార్థులు 500 అడుగుల జాతీయ పతాకంతో మంచాల గ్రామంలో హర్ ఘర్ తిర ర్యాలీ నిర్వహించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సిహెచ్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేస్తూ జాతీయ గీతాలను ఆలపిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. మోడల్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ

గొలుగొండ : స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బిజెపి గొలుగొండ మండల అధ్యక్షుడు సందాక గౌరీ నాయుడు ఆధ్వర్యంలో జాతీయ జెండాలు చేతపట్టుకొని బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏఎల్ పురం నుంచి గొలుగొండ మండలకేంద్రం వరకు నిర్వహించిన ర్యాలీలో అరిమెలరాజు, రీమల చంద్రరావు, దరిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.



నక్కపల్లిలో 78, ఆగస్టు 15 ఆకృతిలో విద్యార్థులు

250 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన

ఆనందపురం : మండలంలోని వెల్లంకి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యాన విద్యార్థులతో 250 మీటర్ల భారీ జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాకర సురేష్ కుమార్, మేము సైతం వ్యవస్థాపక అధ్యక్షులు అక్కిరెడ్డి దేవుడుబాబు, లెంక అప్పలరాము, ఫౌండేషన్ ప్రతినిధులు సాడి శంకర్, టి.జగదీష్, పి.సాయిరెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

గొట్టిపల్లిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఆనందపురం మండలం గొట్టిపల్లి గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక సచివాలయ సిబ్బంది ఆధ్వర్యాన 78 మీటర్ల జాతీయ జెండాతో హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో గ్రామ కార్యదర్శి సురేష్ బాబు, హైస్కూల్ ఇన్చార్జి హెచ్ఎం అప్పారావు, మాజీ సర్పంచ్ కోరాడ నాయుడు బాబు, డబ్బీరు విజయ్‌కుమార్, కోరాడ తమ్ము నాయుడు పాల్గొన్నారు.

చెక్కతో అశోకచక్రం

దేశభక్తిని చాటుకున్న సూక్ష్మ కళాకారుడు



ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, కార్పెంటర్ దార్ల రవి తన సూక్ష్మ కళతో దేశభక్తిని చాటుకున్నాడు.స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని చెక్కతో అశోక చక్రం చెక్కి అందరినీ అబ్బురపరిచాడు .

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక

78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

44వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం

Advt. Feature

విశాఖపట్నం | గురువారం 15-08-2024 | 8 పేజీలు

స్వాతంత్ర్యోద్యమ కీర్తిపతాక.. విశాఖ

ప్రజాశక్తి - విశాఖపట్నం

స్వాతంత్ర్యోద్యమంలో విశాఖది కీలకపాత్ర. నాడు ఎన్నో పోరాటాలకు వేదికగా నిలిచిన ఈ నగరం ఇప్పటికీ పోరుగడ్డగా జన హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల వేళ ఓసారి చరిత్రపుటను తిరగేస్తే ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ... కొత్త సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్న భారతదేశం, అందునా పోరు విశాఖ మన కళ్ల ముందు కదలాడతాయి. బ్రిటిష్ వారిపై తొలి రోజుల్లోనే తిరుగుబాటు చేసిన ఘన చరిత్ర విశాఖ ప్రజలది.

- **కీలక పోరాటాలకు వేదిక**
- **నేటితరానికి ఉత్తేజం నింపే స్ఫూర్తి ఘట్టాలు అనేకం**

ఇప్పుడు విశాఖ పేరు వినగానే ఇక్కడున్న ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్‌ప్లాంట్, పోర్టు, హెచ్‌పిసిఎల్, భెల్, రక్షణ రంగం, రైల్వే, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) వంటి కీలక పరిశ్రమలు గుర్తుకురాక మానవు. ఇవన్నీ నాటి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి పతాకగా వెలుగొందుతున్నాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఢిల్లీ గద్దెనెక్కిన కాషాయ పాలకుల పుణ్యమా అని.. స్వాతంత్ర్య స్ఫూర్తితో ఆవిర్భవించిన ప్రభుత్వ రంగ సంస్థలు ఒక్కొక్కటిగా అంతర్ధానమైపోయే పరిస్థితులు దాపురిస్తున్నాయి. వీటి ఏర్పాటుకు నాడు, ప్రభుత్వ రంగ పరిరక్షణకు నేడు సాగుతున్న ఉద్యమాలకు స్వాతంత్రోద్యమ చరిత్రే వారసత్వంగా దర్శనమిస్తోంది. విశాఖకు స్వాతంత్ర్య ఉద్యమానికి ఎంతో దగ్గర సంబంధం, విడదీయరాని బంధం ఉందనడంలో ఎలాంటి సందేహమూ లేదు..

నాడు విశాఖలో సాగిన ఉప్పు సత్యాగ్రహం, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి నేటికీ కొనసాగుతుండటానికి ఈ ప్రాంత ప్రజల పట్టుదల... పోరాటాల పట్ల నిబద్ధతే కారణం. స్వాతంత్ర్య ఉద్యమ మూలాలు మన విశాఖతో పెనవేసుకుని ఉండడం నిజంగా గర్వకారణమనే చెప్పాలి. దేశం నుంచి బ్రిటిష్ వారిని (మిగతా 8లో..)



విశాఖ బీచ్ రోడ్డులో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి ర్యాలీలో కలెక్టర్, అధికారులు, విద్యార్థులు

స్వాతంత్ర్యోద్యమంలో మహిళల సమరశీల పోరాటం

ప్రజాశక్తి -కలెక్టరేట్

స్వాతంత్ర్యోద్యమంలో మహిళలు సమరశీల పోరాటాలు కొనసాగించారు. విశాఖ జిల్లాకు చెందిన ఎందరో మహిళలు సమరశీల పాత్ర పోషించారు. బ్రిటీషు ముష్కర పాలనకు నిరసనగా దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన మహోద్యమంలో నిప్పుకణికలయ్యారు. వీరందరి పేర్లూ చరిత్రలో లిఖించబడక పోయినప్పటికీ స్వాతంత్ర్యోద్యమానికి వీరిచ్చిన తోడ్పాటు, మిలిటెన్సీ పోరాటాల్లో వీరు ప్రదర్శించిన తెగువ, ధైర్యసాహసాలూ... ఎంతో కీలకమైనవి. స్త్రీలు చదువుకోవడాన్ని సైతం అంగీకరించని ఆనాటి సమాజపు కట్టుబాట్లను ఛేదించి మరీ తెల్లదొరల పాలనను అంతమొందించేందుకు విశాఖ జిల్లా మహిళలు నడుం బిగించారు. పురుషులతో సమానంగా భుజంభుజం కలిపి పోరాటాలకు సిద్ధమయ్యారు. కన్నూమిన్నూ కానని బ్రిటీషు నిర్బంధం కొనసాగుతున్న రోజుల్లో గర్భిణులు సైతం ఆందోళనల్లో అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శించారు. కుటుంబాలకు దూరంగా, ఒంటరిగా జైలు జీవితాన్ని అనుభవించారు. కొంతమంది జైళ్లలోనే బిడ్డలకు జన్మనిచ్చారు. ఒకపక్క కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరోవైపు దేశంకోసం జీవితాలను త్యాగం చేసేందుకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో ఎదురైన బ్రిటీషు నిర్బంధం, ఆటంకాలు వారిలోని దేశభక్తిని ఏమాత్రం చెదరగొట్టలేకపోయాయి.

ఆంధ్ర రాష్ట్రం మొత్తమ్మీద బ్రిటీషు ప్రభుత్వ నిర్బంధానికి గురై జైలు శిక్ష అనుభవించిన తొలి మహిళ విశాఖపట్నానికి చెందిన దిగుమర్తి జానకీబాయమ్మ కావడం మన జిల్లాకు ఎంతో గర్వకారణం. దేశస్వాతంత్ర్య పోరాటంలో భాగంగా విశాఖ జిల్లాలో నడిచిన ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా తదితర ఉద్యమాల్లో జిల్లా మారుమూల ప్రాంతాల మహిళలు సైతం చురుకైన పాత్ర పోషించారు. కొన్ని ఉద్యమాలను మహిళలే ముందుపీఠిన ఉండి నడిపించారు. యలమంచిలి, అనకాపల్లి,

విశాఖలో జానకీబాయమ్మ పాత్ర వీరోచితం
నాయకీమణులకు దిమిలి గ్రామం పుట్టినిల్లు



విశాఖపట్నం, యలమంచిలి మండలంలోని దిమిలి, మాడుగుల తదితర ప్రాంతాల్లో మహిళా ఉద్యమాలు నడిచాయి. మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, వరకట్న వేధింపులు వంటి గృహ, సామాజిక హింసలు పెరుగుతున్న నేటి తరుణంలో ఆనాటి మహిళా ఉద్యమ గాథలను మననం చేసుకోవడం అత్యంత ఆవశ్యకం.

విశాఖపట్నంలో జన్మించిన జానకీబాయమ్మ జిల్లా జాతీయోద్యమంలో నాయకత్వ పాత్ర పోషించింది. శాసనోల్లంఘన, ఉప్పు సత్యాగ్రహం, రౌలత్ బిల్లుకు నిరసనగా నిర్వహించిన సత్యాగ్రహం తదితర అనేక ఉద్యమాల్లో తెగువ ప్రదర్శించింది. గర్భిణిగా ఉన్న సమయంలో సైతం ఆమె ప్రత్యక్ష పోరాటాలను నడపడానికి వెరవలేదు. చివరకు ఇలా ఉండగానే బ్రిటీషు నిర్బంధానికి గురై రాయవేలూరు జైలులో శిక్ష అనుభవించింది. జైల్లోనే ఆమె ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈ బిడ్డ జైల్లోనే ఏడునెలలపాటు పెరిగింది.

విద్యార్థి దశ నుంచే బ్రిటీషు వ్యతిరేక ఉద్యమం పట్ల ఆకర్షితులైన జానకీబాయమ్మ జాతీయోద్యమంలో అడుగుపెట్టింది. విశాఖ క్వీన్‌మేరీ హైస్కూల్లో చదువుతుండగా దక్షిణాఫ్రికా సత్యాగ్రహోద్యమానికి, బందరులో జాతీయ కళాశాల స్థాపనకు విరాళాలు వసూలు చేసింది. 1915లో పెళ్లిచేసుకొని, అనంతరం జిల్లాలో ఆందోళనకు నాయకత్వం వహించింది. స్వాతంత్ర్యయోధులైన ఆమె భర్త దిగుమర్తి రామస్వామి పంతులు ఆమెకు పూర్తి సహాయ సహకారాలు అందించారు. ఈమె 1920లో కాకినాడ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యురాలిగా నియమితులయ్యారు. జిల్లాలో ఉప్పు సత్యాగ్రహ శిబిరం ఈమె నాయకత్వంలోనే నడిచింది. ఆమె విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నిర్వహించిన ప్రచారయాత్రల్లో పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం ఆమె విశాఖ పురపాలక సంఘ సభ్యురాలిగా రెండుసార్లు ఎన్నికయ్యారు.

యలమంచిలికి చెందిన కాలనాథభట్ల మహాలక్ష్మమ్మ శాసనోల్లంఘన, ఉప్పు సత్యాగ్రహోద్యమాల్లో చురుకైన పాత్ర పోషించింది. 1920లో చోటు చేసుకున్న ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఆరునెలల కఠిన కారాగార శిక్ష అనుభవించింది. 1933లో శాసనోల్లంఘనలో ముందుపీఠిన నిలిచి మళ్లీ వెల్లూరు, కన్ననూరు జైళ్లలో శిక్ష అనుభవించింది. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని మరో మూడు మాసాలు జైలు పాలైంది. ఆమె 1967లో కన్నుమూసింది. యలమంచిలికి చెందిన మిస్సుల లక్ష్మీ నరసమ్మ శాసనోల్లంఘన ఉద్యమంలో అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శించింది. గర్భిణిగా ఉన్న సమయంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని బ్రిటీషు నిర్బంధానికి గురైంది. నిండు గర్భిణి అయిన ఆమె అత్యంత కష్టతరమైన పరిస్థితుల్లో జైలు జీవితాన్ని అనుభవించింది. కన్ననూరు జైల్లో ఒక ఆడశిశువుకు జన్మనిచ్చింది. తిరిగి 1932 సెప్టెంబర్‌లో అరెస్టయి మరో నాలుగు నెలలు వెల్లూరు, కన్ననూరు జైళ్ళలో శిక్ష అనుభవించింది.

శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు బ్రిటీషు ప్రభుత్వం లింగమాంబకు రూ.200 జరిమానా విధించింది. జరిమానా చెల్లించకుంటే జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. ఈ మొత్తాన్ని చెల్లించగలిగిన స్థోమత ఉండి కూడా బ్రిటీషు పాలకుల ఎదుట తలవంచేందుకు లింగమాంబ సిద్ధపడలేదు. ఆరు నెలల జైలు జీవితాన్ని అనుభవించింది. యలమంచిలి మండలంలోని దిమిలి గ్రామానికి చెందిన ఈమె 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని మూడు నెలలు కారాగార శిక్షను అనుభవించింది. క్విట్‌ఇండియా ఉద్యమంలో ముందుపీఠిన నిలిచి మరో మూడు నెలల పాటు జైలు జీవితాన్ని గడిపింది. ఇదే గ్రామానికి చెందిన్ల సోదెమ్మ, లక్ష్మీనరసమ్మ, శ్యామసుందరమ్మ ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొన్నారు. 1940లో నిర్వహించిన వ్యక్తి సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్నందుకు సోదెమ్మ మూడునెలల జైలు శిక్ష అనుభవించింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని లక్ష్మీనరసమ్మ వెల్లూరు జైల్లో మూడునెలల పాటు, శ్యామ సుందరమ్మ ఏడునెలల పాటు కారాగార శిక్ష అనుభవించారు.

అనకాపల్లికి చెందిన దర్భా వెంకట రమణమ్మ శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని ఈ ప్రాంత మహిళలను కదిలించింది. ఇందుకోసం నాలుగు నెలలపాటు నెల్లూరు, వెల్లూరు జైళ్లలో శిక్ష అనుభవించింది. కొడుకుల కామేశ్వరమ్మ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని మూడు మాసాలపాటు వెల్లూరు జైల్లో శిక్ష అనుభవించింది. దేశాయి 1941లో వ్యక్తి సత్యాగ్రహంలో తెల్లదొరల నిర్బంధానికి గురైంది. విశాఖపట్నం వాసి గుండుమల్ల రంగనాయకమ్మ శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని ఆరు మాసాల జైలుశిక్ష అనుభవించింది.

స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన అందరి మహిళల పేర్లూ చరిత్రకెక్కక పోయినప్పటికీ జిల్లాలో ఏజెన్సీ, మైదాన ప్రాంతాల బ్రిటీషు వ్యతిరేక పోరాటంలో స్త్రీల పాత్ర అద్వితీయమైనది. మన్నెంలో అల్లూరి సీతారామరాజు నడిపిన బ్రిటీషు వ్యతిరేక పోరాటానికి గిరిజన మహిళలు అనూహ్యమైన సహాయ సహకారాలు అందించారు. రహస్యజీవితం గడుపుతున్న ఉద్యమకారులకు ఆహారాన్ని సమకూర్చి, వారి బట్టలు ఉతకడం తదితర పనులను చేయడం ద్వారా సహకరించారు.

ఎన్ని ఒత్తిడులొచ్చినా, శారీరక, మానసిక హింసలు ఎదురైనా ఉద్యమ రహస్యాలను కడుపులో పెట్టుకొని స్ఫూర్తిదాయకంగా నిలిచారు. నేడు దేశంలో అసమానతలు పెచ్చుమీరుతూ, సామాన్యుల బతుకులు ఛిద్రమవుతున్న తరుణంలో నాడు తెల్లదొరలను తరిమికొట్టిన ఉద్యమ గాథలను మననం చేసుకోవడం, ఆ స్ఫూర్తితో ఉద్యమించడం అత్యంత ఆవశ్యకం.

మనోహరంగా మహనీయుల విగ్రహాలు!

స్ఫూర్తిమంతంగా బీచ్ రోడ్డులో కొలువు .... విశాఖ పర్యాటక అందాలకు అదనపు ఆకర్షణ



చాచా నెహ్రూ | నేతాజీ సుభాష్ చంద్రబోస్ | దుర్గాభాయి దేశ్‌ముఖ్ | కందుకూరి వీరేశలింగం | మన్యంవీరుడు అల్లూరి

ప్రజాశక్తి-విశాఖపట్నం

కొందరి విగ్రహాలు మనలో నిరంతరం స్ఫూర్తి నింపుతూ ఉంటాయి. వారి ఆదర్శాలు ముందుకు నడిపిస్తూ ఉంటాయి. వారి ఆచరణ మనకు దారి చూపుతూ ఉంటుంది. వారి తెగువ, ధైర్య సాహసాలు మనలో పౌరుషాన్ని రగిలిస్తాయి. మరికొందరి విగ్రహాలు వారు ఎదిగిన తీరును గుర్తుకు తెస్తుంటాయి. అటువంటి ప్రముఖుల విగ్రహాలు విశాఖ రామకృష్ణ బీచ్‌లో కొలువుదీరి ఉన్నాయి. బీచ్ రోడ్డుకే అలంకరణగా నిలిస్తున్నాయి. ప్రపంచంలోని అందమైన నగరాలలో మొదటి శ్రేణిలో ఉన్న విశాఖపట్నంలో ఎన్నో చూడదగిన ప్రదేశాలున్నాయి. అందుకే ఎక్కడెక్కడినుంచో సందర్శకులు విశాఖ అందాలను తిలకించడానికి వస్తుంటారు. కనువిందు చేసే అందాలను తిలకించడంతో పాటు సాగరతీరాన రామకృష్ణ బీచ్‌లో సాగర కెరటాలను చూసి ఆనందిస్తుంటారు. అలా ఆనందించడంతో పాటు బీచ్‌రోడ్‌లో నడకను ఆస్వాదిస్తారు. బీచ్‌రోడ్‌లో నడుస్తూ అక్కడ ప్రతిష్టించబడిన అనేక మంది ప్రముఖుల విగ్రహాలను చూసి అచ్చెరువొందుతుంటారు.

బీచ్‌రోడ్‌లో 50 విగ్రహాలు

తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపచేసిన అనేక మంది ప్రముఖులతో పాటు స్వాతంత్ర్య సమరయోధులు, సామాజిక వేత్తలు, కవులు, రచయితలు, రాష్ట్ర ప్రముఖుల విగ్రహాలు విశాఖ బీచ్‌రోడ్డులో కొలువుదీరి ఉన్నాయి. బీచ్‌రోడ్‌లో రామకృష్ణ బీచ్ వద్ద విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహం బీచ్‌రోడ్‌లో విగ్రహాల వైపు మార్గం చూపుతూ ఉండగా, మరోవైపు డచ్‌హౌస్ అపార్ట్‌మెంట్స్ వద్ద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహం చేయెత్తి పలకరిస్తున్నట్లుంటుంది. ఈ రెండు విగ్రహాలు బీచ్ రోడ్ మధ్యలో ఉండగా మిగతా విగ్రహాలు సముద్రం వైపు చూస్తూ బీచ్‌రోడ్‌లో నగరం వైపు వరుసగా కొలువుదీరి ఉన్నాయి.

స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల విగ్రహాలు

స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి ప్రధాని పండిట్‌జవహర్ లాల్ నెహ్రూ, దేశ ఉప ప్రధానిగా పనిచేసిన స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగజ్జీవన్‌రామ్, మద్రాసు ప్రెసిడెన్సీ (1932-37) ముఖ్యమంత్రిగా పని చేసిన ఆర్‌ఎస్ఆర్‌కె.రంగారావు (బొబ్బిలిరాజా), రాష్ట్రపతిగా ఉన్నత పదవి చేపట్టిన కార్మిక ఉద్యమనాయకుడు వరాహగిరి వెంకటగిరి, మూడవ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, తదితరుల విగ్రహాలు తాము ఉన్నత పదవులకు ఎదిగిన తీరు తెలుసుకోమంటుంటాయి. ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రబోస్, ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో యువతలో స్వాతంత్ర్య ఉద్యమ కాంక్షను రగిలించిన విప్లవ వీరుడు భగత్‌సింగ్, ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు, బొబ్బిలిపులి తాండ్రపాపారాయుడు, నాస్తికవాది, సంఘ సంస్కర్త, తమిళనాడులో ఆత్మగౌరవ ఉద్యమం, ద్రావిడ ఉద్యమ నిర్మాత పెరియార్ ఇవి రామస్వామి తదితరుల విగ్రహాలు వారి ధైర్య సాహసాలు, త్యాగాలు, ఆదర్శాలు మనకు నిరంతరం గుర్తుకు తెస్తూ ఉంటాయి.

పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, బౌద్ధమత వ్యవస్థాపకుడు గౌతమ బుద్ధుడు, జైన మత వ్యవస్థాపకుడు వర్ధమాన మహావీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు రైతు ఉద్యమనాయకుడు ఆచార్య ఎన్‌జి రంగా, మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య, కొవ్వూరి గంగిరెడ్డి, రైలింజన్‌ను ఒంటిచేత్తో ఆపిన కోడి రామమూర్తి, రాచరిక వ్యవస్థలో పుట్టినా సామ్యవాదం కోసం కృషి చేసిన పివిజి.రాజు తదితరుల విగ్రహాలు తమ గుర్తించి తెలుసుకోమంటున్నాయి.

మహిళా మూర్తి ఒక్కరే

బీచ్‌రోడ్‌లోని విగ్రహాలలో మహిళా మూర్తి ఒక్కరే కనిపిస్తారు. ఆ స్త్రీమూర్తి ఆంధ్ర మహిళాసభ స్థాపకురాలు, సంఘసేవికురాలు దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కావడం విశేషం.

సాహిత్య, సంగీతానికి పెద్ద పీట

బీచ్‌రోడ్‌లో కొలువై ఉన్న విగ్రహాలను పరిశీలిస్తే సాహిత్యానికి పెద్ద పీట వేసినట్లు కనిపిస్తుంది. సాహితీ సమరాంగణ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు, మహాప్రస్థానంతో మరో ప్రపంచానికి దారిచూపిన శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ), నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం, పురిపండా అప్పలస్వామి, కొప్పరపు కవులు కొప్పరపు వెంకట సుబ్బరాయకవి, కొప్పరపు వెంకట రమణ కవి, విశ్వనాథ సత్యనారాయణ, కవికోకిల గుర్రం జాషువా, డాక్టర్ సి.నారాయణరెడ్డి, తిరుపతి వెంకట కవులు దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, అడవి బాపిరాజు, పదకవితాపితామహుడు అన్నమయ్య, ఆరుద్ర (భాగవతుల సదాశివశాస్త్రి), గేయ రచయిత జాలాది రాజారావు, రావిశాస్త్రిగా పిలవబడే రాచకొండ విశ్వనాథ శాస్త్రిల విగ్రహాలు పర్యాటకులను పలకరిస్తూ వారి సాహిత్య సౌరభాల గురించి తెలుసుకోమంటుంటాయి. గానామృతాన్ని పంచిన ఘంటసాల వెంకటేశ్వరరావు, ప్రముఖ సంగీత విద్వాంసుడిగా కీర్తి పొందిన నేదునూరి కృష్ణమూరి, వయొలిన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామి నాయుడు, హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు విగ్రహాలు తమ గురించి తెలుసుకోమంటుంటాయి.

అభిముఖంగా అల్లూరి విగ్రహం

బీచ్‌రోడ్‌లోని పార్క్‌హోటల్ జంక్షన్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం బీచ్‌రోడ్‌లోని అన్ని విగ్రహాల కన్నా భిన్నంగా ఉంటుంది. అన్ని విగ్రహాలు ఉరకలెత్తే అలల కెరటాలను వీక్షిస్తూ ఉంటే అల్లూరి సీతారామరాజు విగ్రహం విశాఖ నగర వాసులను చైతన్య పరుస్తున్నట్లుగా నగరానికి అభిముఖంగా ఉండడం విశేషం.అంతేకాకుండా ప్రముఖ సినీ నటుడు అల్లురామలింగయ్య విగ్రహంతో పాటు సాగరకన్యల విగ్రహాలు మనకు బీచ్‌రోడ్‌లో కనిపిస్తాయి. ఉత్తరాంధ్రకు చెందిన వాగ్గేయకారుడు, జానపద కవి, తన ఆట, పాట ద్వారా జనం గొంతుకైన వంగపండు ప్రసాదరావు విగ్రహాన్ని తాజాగా ఏర్పాటు చేశారు. అదే సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా మార్చి, విశాఖ నగర నిర్మాణానికి పునాదిరాళ్ళు వేసిన సర్ ఆర్థర్ కాటన్, తెలుగు భాషకు ఎనలేని సేవ చేసిన సిపి బ్రౌన్, ఆంధ్రులను హాస్య తరంగాలలో ముంచెత్తి విశాఖ నగర అభివృద్ధిని ఏ యేటి కాయేడు తన సినిమాలలో చిత్రీకరించిన జంధ్యాల వంటి మహనీయుల విగ్రహాలు కూడా పర్యాటకులకు కనువిందు చేస్తే మరింత బాగుంటుంది.

స్వాతంత్ర్యోద్యమంలో విశాఖ

ప్రజాశక్తి - విశాఖపట్నం

స్వాతంత్ర్యోద్యమంలో ఉమ్మడి విశాఖ జిల్లా నేతలు కీలకపాత్ర పోషించారు. తెల్లవాడిపై తొలిపోరాటం, ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా ఉద్యమాల్లో నేతలు పాల్గొన్నారు. ఎందరో నేతలు బ్రిటిష్ పోలీసుల చేతుల్లో లాఠీదెబ్బలు తిన్నారు. అరెస్టయ్యారు. జైలుశిక్షలు అనుభవించారు. ఎవిఎన్, ఆంధ్రా మెడికల్ కళాశాలల విద్యార్థులు అనేక మంది చదువుకు స్వస్తి చెప్పి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్రోద్యమంలో కమ్యూనిస్టులూ కీలకపాత్ర పోషించారు. విశాఖ, అనకాపల్లి, మాడుగుల, యలమంచిలి ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున పోరాటాలు నడిపారు.



స్వాతంత్ర్య చరిత్ర పుటల్లో పద్మనాభం యుద్ధం

తెల్లవాడిపై తొలిపోరాటం జరిగిన పద్మనాభం యుద్ధం చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వలస పాలనతో దేశంలోని సహజ వనరులు దోపిడీకి గురయ్యాయి. అప్పట్లో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దోపిడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అనేకచోట్ల పలు రూపాల్లో పోరాటాలు సాగాయి. విశాఖ జిల్లాలోని పద్మనాభం యుద్ధం కూడా అందులో భాగమే. ఇది ఒక సంస్థానానికి, బ్రిటిష్ వారికి మధ్య జరిగిన యుద్ధమే కావచ్చు. కానీ, బ్రిటీష్ సామ్రాజ్యవాదుల దోపిడీ విధానానికి వ్యతిరేకంగా జరిగిన యుద్ధం. విజయనగరానికి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న పద్మనాభం (విశాఖ జిల్లా)లో ఈ యుద్ధం జరిగింది. అందువల్లనే పద్మనాభం యుద్ధంగా ప్రసిద్ధి చెందింది. యుద్ధంలో ఆంగ్లేయుల ఆధునిక ఆయుధాలకు, రెండో విజయరామరాజు సాధారణ ఆయుధాలు కొరగాకుండా పోయాయి. యుద్ధంలో రెండో విజయరామరాజుతోపాటు 309 మంది వీర మరణం పొందగా, బ్రిటిష్ సైనికులు 13మంది మృతి చెందారు.

బ్రిటీషర్లపై మన్యవాసుల గెరిల్లా పోరాటం

అడవిపై బ్రిటీష్ పాలకులు తీసుకొచ్చిన నిరంకుశ చట్టాలకు గిరిజనులు వ్యతిరేకించారు. 1845లో గొలుగొండ ఏజెన్సీ ప్రజలు ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ శిస్తులు చెల్లింపునకు నిరాకరించారు. ప్రభుత్వ సైన్యాలను, పోలీసులను తమ గెరిల్లా పోరాటం ద్వారా మూడేళ్లపాటు ప్రతిఘటించారు. సిపాయిల తిరుగుబాటు జరిగిన 1857లో గొలుగొండ ఏజెన్సీ ప్రజలు కూడా తిరుగుబాటు జరిపారు. 1879లో ఏజెన్సీ అధికారుల దోపిడీకి వ్యతిరేకంగా రంప తిరుగుబాటు జరిగింది. తిరుగుబాటుకు నాయకత్వం వహించిన వీరయ్యదొరను బ్రిటీష్ పోలీసులు కాల్చి చంపారు. 1858, 1861ల్లో సాగిన రైతు తిరుగుబాట్లు, 1879లో జరిగిన రంప పితూరీ విశాఖ మన్యాన్ని కదిలించింది. 1922 ఫిబ్రవరిలో సవరల పోరాటం జరిగింది. అడవిలో గడ్డిని తెచ్చుకోవటానికి బ్రిటీష్ పాలకులు అడ్డంకులు కల్పించడంతో సవరలు తిరుగుబాటు చేశారు.

అల్లూరి పోరాటం చారిత్రాత్మకం

అల్లూరి సీతారామరాజు నడిపిన పోరాటం స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యేక స్థానాన్ని పొందింది. అల్లూరి పోరాటం బ్రిటీష్ వారిని గడగడలాడించింది. విద్యార్థి దశలోనే దోపిడీని రూపుమాపేందుకు అల్లూరి తనవంతు పోరాటం ప్రారంభించారు. 'ఎవడురా? నా భరతజాతిని కప్పమడిగిన దుష్టుడు' అంటూ బ్రిటీష్ అధికారులను ఎదిరించాడు. 1922 ఆగస్టు 22న తొలిసారిగా చింతపల్లి పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారు. ఆ మరునాడే రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్‌పైనా, ఆ మరునాడు అడ్డతీగల, రంపచోడవరం పోలీస్‌స్టేషన్లపై దాడులు జరిపారు. ఈ పోరాటాన్ని అణచివేసేందుకు బ్రిటీష్ ప్రభుత్వం నిరంకుశ సైనాధికారి రూథర్ ఫర్డ్‌ను ప్రత్యేకంగా రప్పించింది. అల్లూరి జాడకోసం గిరిజనులను అనేక విధాలుగా బ్రిటీష్ సైనికులు హింసించారు. 1924 మే 12న కొయ్యూరుకు సమీపంలో అల్లూరి బంధించి కాల్చిచంపారు.

సంపూర్ణ స్వాతంత్ర్యమే లక్ష్యంగా కమ్యూనిస్టుల పోరాటం

1921లోఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునివ్వడంతో అప్పటివరకూ సాగిన స్వాతంత్ర్య పోరాటం దిశ మారింది. సరిగ్గా అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో మహాత్మాగాంధీ శకం బలోపేతమైంది. భారతజాతిని ఒక్కతాటిపై నిలిపి, బ్రిటిష్ వాడికి వ్యతిరేకంగా నిలపడంలో గాంధీ పోషించిన పాత్ర ఎంతో ఉన్నతమైనది. ప్రతి భారతీయుడినీ స్వాతంత్ర సమరోన్ముఖుల్ని చేయడం కోసం ఆయన దేశంలోని ప్రతి ప్రాంతంలోనూ విస్తృతంగా పర్యటించారు. తన పర్యటనలో భాగంగా ఆయన విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాలను పర్యటించారు.

బాపూజీకి బాసటగా..

1920లో దేశంలో స్వాతంత్ర్య కాంక్ష బలీయమైంది. విశాఖ జిల్లా నుంచి ఎందరో యువకులు, మహిళలు స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారు. అదే సమయంలో గాంధీ విశాఖ జిల్లాలో పర్యటించారు. గాంధీ ప్రసంగాలకు యువత స్ఫూర్తి పొంది పెద్దఎత్తున ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1921 మార్చి 31న విజయవాడలో ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు గానూ గాంధీ కోల్‌కత్తా నుంచి మార్చి 27న మెయిల్‌లో బయల్దేరారు. మార్గమధ్యలో అనకాపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఆగి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గాంధీజీ తిరిగి 1929 ఏప్రిల్ 28న విశాఖపట్నం మరోసారి వచ్చారు. భీమునిపట్నం, అనకాపల్లి, ఏటికొప్పాక, చోడవరం, కైలాసపట్నం, నక్కపల్లి తదితర ప్రాంతాల్లో గాంధీ పర్యటించి, ఖద్దరు నిధి వసూలు చేశారు. 1933లో మరోసారి గాంధీ విశాఖపట్నం వచ్చారు. అస్పృశ్యతా నివారణోద్యమంలో భాగంగా ఆయన ఈ దఫా పర్యటించారు. ఈ సందర్భంగా పెద్దమొత్తంలో హరిజన ఫండ్ సమకూరింది. 1946లో గాంధీ మరోసారి విశాఖ జిల్లాలో పర్యటించారు. కళా వెంకటరావు, తెన్నేటి విశ్వనాథం, ముళ్లపూడి పళ్లంరాజు, కొల్లూరి వీరభద్రరావు తదితరులతో కలిసి గాంధీ రైల్వే మైదానంలోని బహిరంగ సభకు కాలినడకన వెళ్లారు. అక్కడ జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో విశాఖ జిల్లాను గాంధీజీ నాలుగుసార్లు సందర్శించారు. ఇలా పర్యటించి నప్పుడల్లా గాంధీకి విశాఖ ప్రజలు అండగా ఉన్నారు. గాంధీ స్ఫూర్తితో అనకాపల్లి, మాడుగుల, యలమంచిలి వంటి ప్రాంతాల్లో పెద్దఎత్తున పోరాటాలు చేశారు.

ఉప్పు సత్యాగ్రహంలో అరెస్టుల పర్వం

1930 ఏప్రిల్‌లో జరిగిన ఉప్పు సత్యాగ్రహం జిల్లాలో మూడు విడతలుగా జరిగింది. ఈ బృందాలకు మారేపల్లి రామచంద్రశాస్త్రి, మల్లెమడుగుల జగన్నాథరావు, దిగుమర్తి జానకీబాయమ్మ నాయకత్వం వహించారు. ఒక బృందం అరెస్టయితే, మరో బృందం ఉప్పు సత్యాగ్రహం నిర్వహించేంది. 1930 ఏప్రిల్ 13న సాయంత్రం 4 గంటలకు నగరంలోని టౌన్‌హాల్ ఎదుట సముద్రంలో ఉప్పు వండారు. దీనికి ఐదు వేల మంది పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమంలోనూ కీలకంగా...

1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలోనూ విశాఖ జిల్లావాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనకాపల్లిలో కోరుకొండ బుచ్చిరాజు, కోరుకొండ సుబ్బరాజు, జిక్కినపల్లి శ్రీరామూర్తి తదితరులను బ్రిటీష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఉద్యమానికి ప్రజలను సమీకరించడంలో కమ్యూనిస్టు నాయకులు సిఆర్ వల్లభన్, మళ్ల నర్సింహమూర్తి, పెంటకోట శ్రీరాములు కీలకపాత్ర పోషించారు.

మువ్వన్నెల పతాక రూపకర్త పింగళి

ప్రజాశక్తి - విశాఖపట్నం

బ్రిటీషర్లను పొమ్మంటూనే వారి జెండాను ఉపయోగించడం ఇష్టం లేని పింగళి వెంకయ్య భారతదేశానికి ఒక జెండా ఉండాలంటూ సంకల్పించారు. శాంతి సౌభాగ్యాలకు చిహ్నంగా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ మూడు రంగులతో జెండాను రూపకల్పన చేసి, 1921 మార్చి 31, ఏప్రిల్ 1న బెజవాడలోని గాంధీనగర్ కాంగ్రెస్ మహాసభల్లో గాంధీజీ సమక్షంలో ఆమోదింపజేశారు. మొదట రాట్నం ఉన్న, తర్వాత పెద్దలు ధర్మానికి గుర్తుగా అశోకచక్రంతో జాతీయ జెండా భారతదేశం కీర్తి, స్ఫూర్తిని సగర్వంగా రెపరెపలాడిస్తోంది.

మువ్వన్నెల జెండా రూపకర్త పింగళి వెంకయ్య 1878 ఆగస్టు 2వ తేదీన దివి తాలూకా భట్లపెనుమర్రు గ్రామంలో జన్మించారు. ఆయన బాల్యం, విద్యాభ్యాసం ఇక్కడే కొనసాగింది. 12 సంవత్సరాలకే సెకండరీ విద్య పూర్తిచేసి 19 సంవత్సరాల ప్రాయంలోనే యుద్ధంలో చేరాలనే కోరికతో ముంబై వెళ్ళి సైన్యంలో చేరి ఆఫ్రికాకు వెళ్లారు. అక్కడ గాంధీజీని కలవటం, స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితుడు కావడంతో ఇండియాకు తిరిగి వచ్చారు. అప్పటికే మద్రాసులో ప్లేగు వ్యాధి ప్రబలి ఉండటంతో దేశ ప్రజలను ఆ వ్యాధి నుంచి కాపాడాలన్న తపనతో వ్యాధి నివారణ అధికారిగా పనిచేశారు. 1904లో రష్యాను జపాన్ గెలిచిందన్న వార్త విని వెంకయ్యలోని జిజ్ఞాస మేల్కొని ఇది ఎలా సంభవం, పెద్ద దేశాన్ని ఇంత చిన్నదేశం ఎలా జయించింది అనే తపనతో జపాన్ భాష నేర్చుకుని అనర్గళంగా మాట్లాడారు. జపాన్ వెంకయ్య అని పేరు పెట్టారు ప్రజలు. ఆయనకు ఆ భాష నేర్పిన గురువుకు మన భాషను నేర్పి గురు రుణం తీర్చుకున్నారట వెంకయ్య, వారి పట్టుదల ఎంత దృఢమైనదో యువత గుర్తుంచుకోవాలి.

దేశభక్తిగల వెంకయ్య 1906లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభల్లో పాల్గొని నాటి సభాధ్యక్షులైన దాదాబాయి నౌరోజి మన్ననలు పొంది నిర్ణయ సభ సభ్యునిగా గుర్తింపు పొందారు. వ్యవసాయంపై ఆసక్తితో పరిశోధనలు చేసి వ్యవసాయ శాస్త్రం అనే గ్రంథాన్ని ప్రజలకు అందించారు. వారి మేథా సంపత్తి నుంచి మనం ఎంతైనా నేర్చుకోవాల్సివుంది. అందుకే ఆయనను రాజకీయ ద్రష్టగా అభివర్ణించారు పెద్దలు. 1906లో కోల్‌కొతాలో జరిగిన కాంగ్రెస్ సభల్లో ఇంగ్లీషు వారిని పొమ్మంటూనే వారి జెండాను ఉపయోగించటం నచ్చని వెంకయ్య మనకంటూ ఒక జెండా కావాలనే తపనతో భారతదేశ జాతీయ పతాకం అనే గ్రంథాన్ని 1916లో మనకు అందించారు. అప్పుడు వారిని జెండా వెంకయ్యగా పిలిచే వారు. ఇలా చెప్పుకుంటూ పోతే వారి జీవిత విశేషాలు ఎన్నో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి.



1921 మార్చి 31, ఏప్రిల్ 1న బెజవాడలోని గాంధీనగర్‌లో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ మహాసభల్లో శాంతి సౌభాగ్యాలకు చిహ్నంగా మూడు రంగులతో గాంధీజీ సమక్షంలో వెంకయ్య రూపొందించిన జెండాను ఏకగ్రీవంగా కరతాళ ధ్వనుల మధ్య ఆమోదించబడి మొదట రాట్నం ఉన్న, తర్వాత పెద్దలు ధర్మానికి గుర్తుగా అశోకచక్రంతో మన జాతీయ జెండా కీర్తి అనే ఆకాశంలో విహరిస్తూ భారతదేశం మనది అనే స్ఫూర్తిని గర్వంగా చాటుతూ రెపరెపలాడుతోంది.

స్వాతంత్ర్యోద్యమంలో అపూర్వ చైతన్యం

పోరాట పటిమను ప్రదర్శించిన విశాఖ జిల్లా వాసులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

దేశ స్వాతంత్ర్య పోరాటంలో విశాఖపట్నం జిల్లా వాసులు అపూర్వ చైతన్యాన్ని, పోరాట పటిమను ప్రదర్శించారు. స్వాతంత్ర్యోద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలక ఘట్టంగా సాగింది. ఇందులో విశాఖ జిల్లా ప్రజలు మొక్కవోని దీక్షతో పోరాడారు. బొంబాయి జాతీయ కాంగ్రెస్ సమావేశాల్లో క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకులు పిలుపునిచ్చారు. అక్కడి నుంచి రాగానే, విశాఖలో తెన్నేటి విశ్వనాథాన్ని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై ప్రజానీకం ఉవ్వెత్తున ఎగసింది. ఉపన్యాసాలతో ప్రజల్ని రెచ్చగొడుతున్నారనే నెపంతో ఎలమంచిలిలో ఎంవివి.సత్యనారాయణ, శివ కామేశ్వరరావు, అనకాపల్లిలో కదిరిశెట్టి సుబ్బారావు, కోరుకొండ సుబ్బరాజు, జక్కిపల్లి శ్రీరామ్మూర్తి, విశాఖలో గోకా తమ్మనాయుడు, గెడ్డం సన్యాసిరావు, భీమిలిలో ఎం.వీరభద్రరావు తదితరులను ప్రభుత్వం అరెస్టు చేసింది.



తెన్నేటి విశ్వనాథం

దీనిపై ఆగ్రహించిన ప్రజలు రైల్వే, టెలిగ్రాఫ్, పోస్టాఫీసులు వంటి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. నక్కపల్లిలో టెలిగ్రాఫ్ వైర్లు తొలగించిన అభియోగంపై పాయకరావుపేట నివాసి రంగనాథాచారిని, అతడి మిత్రులను అరెస్టు చేశారు. కార్యకర్తలపై దమనకాండకు నిరసనగా ఆంధ్ర వైద్య కళాశాల, ఎవిఎన్ కళాశాల, అనకాపల్లి మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులు తరగతుల్ని బహిష్కరించారు. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అనకాపల్లిలో కోరుకొండ బుచ్చిరాజు, కోరుకొండ సుబ్బరాజు, జిక్కినపల్లి శ్రీరామ్మూర్తి తదితరులను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. వారు ఆలీపూరు జైలులో శిక్ష అనుభవించారు. ఈ సందర్భంగా ఇంకా మరింతమంది అరెస్టయ్యారు. కమ్యూనిస్టు నాయకులు మణి (సిఆర్ వల్లభన్), మళ్ల నరసింహమూర్తి, పెంటకోట శ్రీరాములు ఆ కాలంలో ప్రజల్ని సమీకరించడంలో కీలకపాత్ర పోషించారు.

అరెస్టులను, నిర్బంధాలను అధిగమించి ఉద్యమ విస్తరణకు కృషి చేశారు. మహాత్మాగాంధీ ఉపవాసదీక్ష పూనితే, ఆయనకు మద్దతుగా 1943 ఫిబ్రవరి 18న ఎవిఎన్ కళాశాల, ఆంధ్ర వైద్య కళాశాలల్లోని వుమెన్స్ హాస్టళ్లలో విద్యార్థినులు కూడా ఉపవాసం చేశారు. ఈ విధంగా స్వాతంత్ర్యోద్యమ అన్ని ఘట్టాల్లోనూ విశాఖ జిల్లా ప్రజలు అపూర్వ చైతన్యం ప్రదర్శించారు.

విశాఖలో విస్తరిస్తున్న ఆతిథ్య రంగం



విశాఖ బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్

విశాఖ మహా నగరంలో ఆతిథ్య రంగం క్రమంగా విస్తరిస్తోంది. ఇందులో పెట్టుబరులు పెట్టేందుకు అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. ఇప్పటికే రూ.450 కోట్లకుపైగా ప్రాజెక్టులు నిర్మాణంలో ఉండగా, త్వరలో మరో రూ.350 కోట్లు మేర పెట్టుబడులొచ్చే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధిలో విశాఖపట్నం ముందు వరుసలో ఉంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అతిథుల సంఖ్య గడిచిన ఏడాదిన్నరలో 38 శాతం పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. ఏడాదికి విదేశీ ప్రతినిథులు సుమారు 15వేల మంది వరకు వస్తున్నారు. ఏడాదిన్నరలోనే వీరి రాక 100 శాతానికి పైగా పెరిగింది. వీరంతా స్టార్ హోటళ్లలోనే బస చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలో సినిమా షూటింగ్‌లు పెరిగాయి. సమీప భవిష్యత్తులోనూ సదస్సులు, షూటింగులు మరింతగా పెరగే అవకాశం ఉంది. రిసార్టులు, బీచ్ రిసార్టులు, రెస్టారెంట్లు, కన్వెన్షన్ సెంటర్లకు ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ రంగంలో పలువురు పెట్టుబడులు పెడుతున్నారు.

తీరం చెంతనే ఎందుకంటే..?

విశాఖ అంటేనే సముద్రం, పర్యాటకం. బీచ్ పక్కనే నడుస్తుంటే అలా సుతారంగా వచ్చి తాకుతూ పోయే సముద్రపు అలలను చూసేందుకు, దేశ



కుర్మన్నపాలెంలోని రామచంద్ర గ్రూపు హోటల్

విదేశాల నుంచి, వివిధ రాష్టాల నుంచి ఏడాది పొడవునా విశాఖకు పర్యాటకులు పోటెత్తుతూనే ఉన్నారు. వారంతా తీరం అందాలను, ఇక్కడి పర్యాటకాన్ని తనివి తీరా వీక్షించేందుకు రోజుల తరబడి ఇక్కడే గడుపుతుంటారు. ఇటువంటి వాళ్ళు ఏటా లక్షల్లో ఉంటారు. వారిని లక్ష్యంగా చేసుకొని బీచ్ వెంటే నగరంలో సాధారణ స్థాయి హోటళ్ల నుంచి భారీ, అతి భారీ స్టార్ హోటళ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఎన్నో ఏళ్ల నుంచి పార్క్ హోటల్, గేట్ వే (తాజ్), వెల్ కమ్, ఫామ్ బీచ్, బేలీఫ్, హరిత, బే పార్క్, నోవాటెల్, అంబికా సీగ్రీన్స్ వంటి స్టార్ హోటళ్లు నడుస్తున్నాయి. బీచ్ రోడ్డు వెంట ఉన్న హోటళ్లు పర్యాటకులను ఆకట్టుకునేందుకు రకరకాల సౌకర్యాలతో పోటీ పడుతున్నాయి. సముద్రాన్ని చూస్తూ హోటల్ గదిలో నిద్రపోవడం మొదలు, తెల్లవారుగానే సూర్య కిరణాలు సముద్రంపై పడే సన్నివేశాన్ని నేరుగా వీక్షించే సీ వ్యూ తరహాలో, గదులతో హోటళ్ళు పర్యాటకులను ఆకర్షించడానికి పోటీ పడుతున్నాయి. సముద్రాన్ని చూస్తూ ఈత కొట్టడం, ఉదయం అద్దాల్లోంచి తీరం అందాలను చూస్తూ, పలహారాలు, భోజనం చేయడం, రాత్రివేళ తీరం దగ్గరలో లైవ్ మ్యూజిక్ వింటూ, క్యాండిలైట్ భోజనాలు చేయడం, రకరకాల సౌకర్యాలను మరికొన్ని హోటళ్ళు అందుబాటులోకి తెచ్చాయి.

ఏటా రూ.140 కోట్ల మేర వ్యాపారం

ప్రస్తుతం విశాఖ నగరంలో త్రీ స్టార్, ఫోర్ స్టార్, ఫైవ్ స్టార్ హోటళు 70 వరకు ఉన్నాయి. వీటిలో బీచ్ రోడ్డులోనే 16 ఉన్నాయి. వన్ స్టార్, టూ స్టార్ హోటళ్లు 1400 ఉన్నాయి. అయితే ఇవన్నీ కలిపి ఏటా సుమారు రూ.140 కోట్ల మేర వ్యాపారం చేస్తుండగా, బీచ్ రోడ్డు వెంటే ఉన్న హోటళ్లు మాత్రం రూ.60 కోట్లకుపైగా వ్యాపారం సాగిస్తున్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. సముద్రానికి పక్కనే ఉన్న హోటళ్లలో పర్యాటకుల నుంచి విపరీతంగా డిమాండ్ ఏర్పడుతుండటంతో కొత్తగా హోటళ్లు నిర్మించే వాళ్లు తొలి ప్రాధాన్యంగా బీచ్ రోడ్డునే ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం బీచ్ వెంబడి ఎగువ, మధ్య తరగతి హోటళ్లలో సుమారుగా 200కు పైగా హోటల్ గదులు అందుబాటులో ఉన్నాయి.

అపార్టుమెంట్లు, ఇళ్లు కూడా హోటళ్లుగా..

బీచ్ పక్కనే హోటళ్లకు డిమాండ్ ఉండటంతో కొందరు వ్యాపారులు తీరానికి పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్లు, ఇళ్లను హోటళ్ళు, గెస్ట్ హౌస్‌లుగా మార్చేస్తున్నారు. ఫ్యామిలీ మొత్తానికి ఇంటి వాతావరణం ఉండేలా ఎన్ని రోజులు కావాలంటే అన్ని రోజులు అద్దెకు ఇస్తున్నారు. ఒక రోజు నుంచి నెల వరకూ కూడా ఈ గెస్ట్ హౌస్‌లు అద్దెకు ఇస్తున్నారు.

ఏటా 70 లక్షల మంది సందర్శన

పర్యాటక రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటంతో దేశీయంగా ఏటా 70 లక్షల మంది వరకు నగరాన్ని సందర్శిస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. దీంతో కొత్తగా బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నారు. హెలీ టూరిజం ప్రారంభించారు. గోవా తరహాలో విశాఖ తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేసేలా అనేక ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ప్రత్యేకించి పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ నుంచి ఎక్కువగా నగరాన్ని సందర్శిస్తున్నారు. గడిచిన ఏడాది కాలంలో అన్ని సదుపాయాలు కలిగిన ఆరు కొత్త హోటళ్లు అందుబాటులోకి వచ్చాయి. మరో ఐదు నిర్మాణంలో ఉన్నాయి.

నగరంలో ఫైవ్ స్టార్ హోటళ్లు : నోవాటెల్, ఫోర్ పాయింట్స్ బేషెరాటన్

ఫోర్ స్టార్ హోటళ్లు : దసపల్లా హోటల్, హోటల్ గ్రీన్ పార్క్, హోటల్ ది సుప్రీం, ఫార్చ్యూన్ ఇన్ శ్రీకన్య, బెస్ట్ వెస్ట్ రామచంద్రా. వెల్ కమ్ హోటల్, గ్రాండ్ బే, ది భీమిలి రిసార్ట్, డాల్ఫిన్ హోటల్, రాడిషన్ బ్లూ, సన్ రే విలేజ్ రిసార్ట్, ఫెయిర్ ఫీల్డ్ మేరియట్



విశాఖలోని దసపల్లా హోటల్

త్రీ స్టార్ హోటళ్లు : హోటల్ విన్నర్ పార్క్, ఎన్ కోర్ ఇన్, ల్యాండ్ మార్క్ ఐన్, వి-హోటల్, అంబికా సీ గ్రీన్స్, హోటల్ రిడ్జ్ కంఫర్ట్, జింజీర్, బేలీఫ్ ఆయుర్వేద స్పా రిసార్ట్స్, ది ఆరంజ్ హోటల్, పామ్ బీచ్ హోటల్ అండ్ రిసార్ట్స్, సిద్ధార్థ రెసిడెన్సీ, రామచంద్రా, రాక్ డేల్ క్లార్క్స్ ఇన్, మైక్రో కాంతి సెంటర్, సాయి ప్రియ బీచ్ రిసార్ట్స్, హోటల్ ఫైవ్ ఎలిమెంట్స్, విహార్ బోతిక్ హోటల్, హోటల్ గ్రీన్ ఆపిల్, ఆపిల్ హోటల్, హోటల్ మైక్రో కాంతి సెంటర్, హోటల్ డైమండ్ ఫెరాల్స్, సెలెక్ట్ హోటల్, హోటల్ విన్నా, హోటల్ మేఘాలయ, క్వాలిటీ ఇన్ బెన్జ్ కృష్ణ, తన్నె గ్రాండ్ హోటల్, దసపల్లా ఎగ్జిక్యూటివ్ కోర్టు, దసపల్లా హెరిటేజ్, రాయిల్ పోర్టు మోటల్, ట్రిబోసాకెట్ ఫ్యారడైజ్, ఎన్స్పైర్ ఇన్, ఎంవిపి గ్రాండ్ విస్ట్రామ్ (రైల్వే స్టేషన్), విస్ట్రామ్ (డాబాగార్డెన్స్), ది పోర్టు హోటల్, హోటల్ ఫైవ్ ఎలిమెంట్స్, శ్రీమహారాజా ఇన్‌తో పాటు మరో 20 వరకూ హోటళ్ళు ఉన్నాయి.

రూ.350 కోట్లతో సెవెన్ స్టార్ ఒబెరాయ్ హోటల్

ఆతిథ్య రంగం ఇంతగా అభివృద్ధి చెందినప్పటికీ, ఇంతవరకు నగరంలో సెవెన్ స్టార్ హోటల్ ఒక్కటి కూడా లేదు. అయితే ఆ కొరతను తీర్చే విధంగా భీమిలి మండలంలో ఒబెరాయ్ హోటల్‌ను రూ.350 కోట్లతో నిర్మిస్తున్నారు. ఇది సెవెన్ స్టార్ హోటల్. గతేడాది అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దీని నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లలో దీని నిర్మాణం పూర్తి చేయాలని భావిస్తున్నారు.

వ్యాపారం ఆశాజనకంగా ఉంది



విశాఖ నగరంలో ఆతిథ్య రంగ వ్యాపారం ఆశాజనకంగా ఉంది. సందర్శకుల సంఖ్య పెరగడంతో హోటళ్ల ఆక్సుపెన్సీ రేటు 40 నుంచి 60 శాతానికి పెరిగింది. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. దీన్ని స్వాగరించాల్సిందే. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభిస్తుంది. రాబోయే రోజుల్లోనూ ఆతిథ్య రంగంలో మరిన్ని మార్పులు రాబోతున్నాయి. కచ్చితమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

- డాక్టర్ ఎస్ఎ.రెహమాన్
జిల్లా హోటళ్ల నిర్వాహకుల అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు

విశాఖలో 'ట్రైబ్ బ్రాండ్' సహజ ఉత్పత్తులు

నాణ్యమైన పసుపు పొడి విక్రయం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ

ట్రైబల్ ఉమెన్ మల్టీ పర్పస్ మ్యుచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా 'ట్రైబ్ బ్రాండ్' పేరుతో సహజమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు ప్యాకింగ్ మార్కెటింగ్ చేయబడుతున్నాయి. వినియోగదారులకు తక్కువ ధరలో ఆరోగ్యకరమైన సహజ ఉత్పత్తులను అందిస్తూ, గిరిజన కుటుంబాల సామాజిక, ఆర్థిక సాధికారత లక్ష్యంగా ఆ సంస్థ పని చేస్తోంది. ఈ సంస్థ ప్రస్తుతం పసుపు పొడిని మార్కెట్ చేస్తోంది.

పసుపు పొడికి శతాబ్దాలుగా ఆయుర్వేదం, సాంప్రదాయ భారతీయ వైద్యంలో విశేష గుర్తింపు ఉంది. ఔషధ, ఆహార, ఆధ్యాత్మిక సందర్భాల్లో పసుపు విస్తృతంగా ఉపయోగించబడుతుంది. ఏజెన్సీ పసుపు సహజంగా అధిక కర్కుమిన్ శాతం కలిగి ఉంది. ఇది శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో పసుపు సహాయపడుతుంది. పసుపు, ఆర్థరైటిస్, జీర్ణ సమస్యలు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, అలెర్జీలు, కాలేయ సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలకు సహజ చికిత్సగా ఉపయోగపడుతుంది.

ట్రైబ్ బ్రాండ్ పసుపు పొడిలో ఎటువంటి కృత్రిమ రంగులు, రసాయనాలు ఉండవు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల గిరిజన రైతులు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించి అధిక నాణ్యత గల పసుపును



పండిస్తున్నారు. సహజ వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పసుపును మాత్రమే ట్రైబ్ బ్రాండ్ సేకరిస్తుంది. ఇలా సేకరించిన పసుపును నాణ్యమైన పద్ధతిలో పొడి చేసి ప్యాకింగ్ చేసి విక్రయిస్తుంది. ఈ పసుపు పొడి 100 గ్రాముల నుండి వివిధ ప్యాకింగ్ సైజుల్లో లభిస్తుంది. మరింత సమాచారం కొరకు కస్టమర్ కేర్ : 0891-2713871, ఇ-మెయిల్ : tribalwomencoopsocietyvsp@gmail.com సంప్రదించవచ్చు.

విశాఖలో పెద్దఎత్తున ఉప్పు సత్యాగ్రహ ఉద్యమం

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఉప్పు తయారీకి బ్రిటీష్ పాలకులు అనుమతి తప్పనిసరిచేయడంపై దేశంలో పెద్దఎత్తున ఆగ్రహజ్వాలలు వ్యక్తమయ్యాయి. మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహం పిలుపు మేరకు విశాఖలోనూ ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఆంగ్లేయుల పాలనలో తెల్లవాడిని ప్రశ్నించడమే పెద్ద సాహసం. అటువంటిది వాడిని ధిక్కరించడం ఇంకెంత సాహసమో అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. అప్పట్లో బ్రిటిష్ పాలకులు ఉప్పు తయారీకి లైసెన్స్ ఫీజు వసూలు చేసేవారు. తమ ఉప్పు పరిశ్రమలను కాపాడుకోవడం కోసం దేశీయంగా ఉప్పు తయారీని నిరోధించాలన్నది ఇందులో ఎత్తుగడ. ఈ నిబంధన ఫలితంగా ఎవరైనా ఉప్పు తయారు చేసుకోవాలంటే అధికారుల అనుమతి తప్పనిసరిగా పొందాల్సి వచ్చేది. సముద్రపు నీటిని మరగకాచితే తయారయ్యే ఉప్పుపై ఈవిధమైన నిబంధన విధించడంపై ప్రజలు సహజంగానే అసంతృప్తికి గురయ్యారు. ఈ నేపథ్యంలో మహాత్మాగాంధీ 1930లో ఉప్పు సత్యాగ్రహానికి పిలుపిచ్చారు. ఈ పిలుపు



అందుకున్న సత్యాగ్రహులు చిన్న కుండలతో సముద్రపు నీరు తెచ్చి పొయ్యిలపై మరిగించి ఉప్పు తయారు చేసేవారు. ఆ సమయంలో పోలీసులు వచ్చి ఆ కుండలను లాఠీలతో పగలగొట్టేవారు. అడ్డుకున్న నాయకులకూ లాఠీదెబ్బలు తప్పేవి కావు. పోలీసుల రాక తెలుసుకున్న కొందరు వారికి దొరక్కుండా కుండలు పట్టుకుని బీచ్‌లో పరుగులు తీసేవారు. ఉప్పు సత్యాగ్రహానికి గాంధీ పిలుపు ఇచ్చిన సమయంలో అనకాపల్లిలో అప్పటి శివాజీ ఖద్దరు స్టోర్స్ మేడపై జిల్లా స్థాయి నాయకుల సమావేశం జరిగింది.

యాదృచ్ఛికంగా అదే రోజు అనకాపల్లి నూకాలమ్మ జాతర కూడా. ఈ అవకాశాన్ని నాయకులు చక్కగా వినియోగించుకున్నారు. కొన్ని వేలమంది ప్రజల మధ్య ఉప్పు సత్యాగ్రహం గురించి, బ్రిటిష్‌వాడి విధానం గురించి ఉత్తేజపూరితంగా ప్రసంగించారు. మాడుగులవాసి భమిడిపాటి చినయజ్ఞనారాయణశర్మ, దిమిలి వాస్తవ్యుడు ఎంవివి.సత్యనారాయణ, అనకాపల్లికి చెందిన గుడి పేర్రాజు తదితరులు ఉపన్యాసాలు ఇచ్చారు. అదే సమయంలో ఉప్పు సత్యాగ్రహం వ్యాప్తి కోసం కొండా వెంకటప్పయ్య పంతులుగారు విశాఖ వచ్చారు. ఆ సందర్భంగా టౌనుహాలు ఎదుట ఉన్న బీచ్‌లో మారేపల్లి రామచంద్రశాస్త్రి (కవిగారు) అధ్యక్షతన సభ జరిగింది. భీమిలి, దిమిలి, విశాఖ తీరాల్లో ఎక్కడ ఉప్పు వండాలనేదానిపై కొంత మల్లగుల్లాలు పడ్డారు. చివరకు విశాఖ బీచ్‌నే కేంద్రంగా ఎంచుకున్నారు. 1930 ఏప్రిల్ 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఉప్పు వండాలని నిర్ణయించారు. ఆ విషయాన్ని అప్పటి జిల్లా కలెక్టర్ బ్రాకెన్‌కు లేఖ ద్వారా తెలిపారు. మొదట్లో బ్రిటిష్ అధికారులు ఇదేదో సాధారణ విషయంగా తీసుకున్నారు. అయితే, ఆ రోజు బీచ్‌లో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో 5వేల మందికి పైగా పాల్గొన్నారంటే ఆశ్చర్యం కలగకమానదు. ఆ సమయంలో పోలీసులు బీచ్‌లో లాఠీఛార్జీ చేశారు. అయినప్పటికీ సత్యాగ్రహులు ఉప్పు తయారుచేసి వేలం వేయగా రూ.3వేలు పైగా వచ్చింది. ఉప్పు సత్యాగ్రహాన్ని అడ్డుకుందుకుగానూ ఏప్రిల్ 17న బ్రిటిష్ ప్రభుత్వం మారేపల్లి రామచంద్రశాస్త్రి, తెన్నేటి విశ్వనాథం, దిగుమర్తి రామస్వామి, కె.ఎస్.గుప్తా, వి.బుచ్చిసుందరరావు, భమిడిపాటి చిన యజ్ఞ నారాయణశర్మ తదితరులను అరెస్టు చేసింది. దీనిని నిరసిస్తూ ఆ మర్నాడు విశాఖలో హర్తాళ్ చేశారు.

నాయకుల అరెస్టుతో ఉప్పు సత్యాగ్రహం వెనుకపట్టు పడుతుందని బ్రిటిష్ అధికారులు భావించారు. అయితే, వారి అంచనాలు తలకిందులయ్యాయి. పి.సీతారామచంద్రరాజు సారథ్యంలో సత్యాగ్రహులు ఉప్పు వండటానికి సిద్ధమయ్యారు. దీంతో, పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. ఈ దశలో ఉద్యమ స్థానం విశాఖ నుంచి ఎలమంచిలి (మిగతా 8లో..)



ప్రజాశక్తిమంతుడు బొమ్మారెడ్డి



ప్రజాశక్తి - విశాఖపట్నం

ఆంధ్ర దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన అన్ని పత్రికల్లోనూ పనిచేసిన ఘనత ప్రజాశక్తి'మంతుడు' బొమ్మారెడ్డికే దక్కింది. అన్ని దశలలోను బొమ్మారెడ్డి పత్రికకు వెన్నెముకగా నిలిచారు. 'ప్రజాశక్తి' దినపత్రిక తెలుగు పత్రికా రంగంలో గుర్తింపు తెచ్చుకుని నేడు ఇంతటి సమున్నత స్థితికి చేరుకుని 44వ వసంతంలోకి అడుగు పెట్టిందంటే ఇందులో బొమ్మారెడ్డి కృషి, త్యాగం మరువలేనిది. బొమ్మారెడ్డి పలు పుస్తకాలు, అనువాద రచనలు చేశారు.

1917లో కృష్ణాజిల్లా తేలప్రోలు గ్రామంలో ధనిక రైతు కుటుంబంలో బొమ్మారెడ్డి జన్మించారు. 2006 అక్టోబరు 13న కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆ ముగ్గురికి ఆయన కోరుకున్న పద్ధతిలోనే సంస్కరణ వివాహం జరిపించారు. తొమ్మిది పదుల నిండైన జీవితంలో అయిదు పదులు కమ్యూనిస్టు పత్రికా సంపాదకునిగా ప్రస్థానం సాగించారు. 1942లో కమ్యూనిస్టు పార్టీ పత్రిక ప్రజాశక్తి రావడంతో అందులో సబ్ ఎడిటర్‌గా చేరారు. కొన్నాళ్లకే పత్రికను ప్రభుత్వం నిషేధించినా బొమ్మారెడ్డి పత్రికా రంగాన్ని విడనాడలేదు. ఆనాటి 'ఆనంద వాణి' పత్రికకు వ్యాసాలు రాస్తుండేవారు. కమ్యూనిస్టు నాయకులందరూ అజ్ఞాత వాసంలోకి వెళ్లగా బొమ్మారెడ్డి మాత్రం గన్నవరం తాలూకా కపిలేశ్వరపురం వద్ద రహస్యంగా రాజకీయ తరగతులు నిర్వహిస్తుండేవారు. అప్పట్లో 'జనత' పత్రికను ఉపయోగించుకోవలసిందిగా గంగినేని వెంకటేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వానికి కబురంపారు. 'జనత' పత్రికను కమ్యూనిస్టు పార్టీ తీసుకుని బొమ్మారెడ్డి, మా భూమి నాటక కర్త వాసిరెడ్డి భాస్కరరావును సంపాదక వర్గంగా నిర్వహించాడు. ఆలోగా విజయవాడలో పార్టీ నాయకులపై నిర్బంధం ముమ్మరం కావడంతో పత్రికను మూసేసి బొమ్మారెడ్డిని మద్రాసు వెళ్ళమని పార్టీ ఆదేశించింది. మద్రాసులో కమ్యూనిస్టు పార్టీ ఒక లా విద్యార్థి పేరుతో 'సందేశం' అనే వార పత్రికను నడిపింది. బొమ్మారెడ్డి ఆ పత్రికలో కొద్దికాలం పనిచేశారు. ఇంతలో తాపీ ధర్మారావు గారి 'జనవాణి'లో చేరవలసిందిగా పార్టీ ఆదేశించింది. దాంతో బొమ్మారెడ్డి తాపీధర్మారావు కుమారుడు మోహనరావుతో కలిసి ఆ పత్రికలో పనిచేశాడు.

మద్రాసులో బొమ్మారెడ్డి లాంటి కమ్యూనిస్టుల పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉండేది. ఆంధ్రలో పార్టీమీద ప్రభుత్వ నిఘా ఎక్కువ కావడంతో నాయకులు మద్రాసుకొచ్చి తలదాచుకునేవారు. వారికి వసతి ఏర్పాట్లు చేసే బాధ్యత బొమ్మారెడ్డి లాంటి యువకులపై ఉండేది. ఎప్పుడు పోలీసులు కన్ను తమపై పడుతుందోననే వాతావరణంలో నాయకులు ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి వచ్చేది. ఇంతలో తెలంగాణా పోరాటం ముగిసి ఆంధ్రలోకి తిరిగి వచ్చి పని చేయడానికి అనువైన పరిస్థితులేర్పడడంతో బొమ్మా రెడ్డి విజయవాడ చేరుకుని 'ప్రజాశక్తి' వారపత్రికలో పనిచేయడం ప్రారంభించారు. విశాలాంధ్ర సంపాదకవర్గంలో చేరి పన్నెండేళ్లపాటు అంటే పార్టీలో చీలిక వచ్చేవరకు అందులో పనిచేశారు. చీలిక తరువాత సిపిఐ(ఎం) తరపున 'జనశక్తి' వార పత్రిక నిర్వహించబడుతుండేది. అప్పట్లో 'జనశక్తి' ఎడిటర్‌ను అరెస్టు చేయడంతో పత్రికా నిర్వహణ బాధ్యతను బొమ్మారెడ్డికి పార్టీ అప్పగించింది.

నాయకులు విడుదలైన తరువాత 'జనశక్తి' దినపత్రికగా మారినా కొన్నాళ్లకు అది మార్క్సిస్టు లెనినిస్టుల చేతికిపోయింది. ఆ తరువాత 'ప్రజాశక్తి' వారపత్రికగా మొదట కొంత కాలం నడిచి తరువాత ద్వైవార పత్రికగా, అటుపిమ్మట దినపత్రికగా మారింది. అన్ని దశలలోను బొమ్మారెడ్డి పత్రికకు వెన్నెముకగా నిలిచారు.



విశాఖలో పెద్దఎత్తున ఉప్పు సత్యాగ్రహ ఉద్యమం

(7వ పేజీ తరువాయి..) సమీపంలోని దిమిలికి మారింది. 1930 మే 4న ప్రజలు విశాఖ నుంచి గుంపులు గుంపులుగా దిమిలి వెళ్లారు. ఇరవైకి పైగా పొయ్యిలు ఏర్పాటుచేశారు. పోలీసులు రంగంలోకి దిగి మిస్సుల సత్యనారాయణ, యల్లాజీ నారాయణరావు, గుడి పేర్రాజు, ప్రయాగ సత్యనారాయణవంటి సత్యాగ్రహుల్ని అరెస్టు చేశారు. వారిని నర్సీపట్నం సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ డిజి.బెల్ ముందు హాజరుపరిచి శిక్ష విధించారు. నాయకులు, ముఖ్య కార్యకర్తలు అరెస్ట్ కావడంతో వారి భార్యలు ఉద్యమంలోకి దూకారు. మారేపల్లి రామచంద్రశాస్త్రి భార్య శారదాంబ, దిగుమర్తి రామస్వామి భార్య జానకీబాయివంటివారు ఈవిధంగానే ఉద్యమంలోకి వచ్చారు.

అనంతరం, రంగం గాజువాక సమీపంలోని బాలచెరువుకు మారింది. అక్కడున్న ప్రభుత్వ ఉప్పు ఫ్యాక్టరీపై దాడిచేయాలని నిర్ణయించారు. నగరంలోని ప్రముఖ న్యాయవాది కందాళ సర్వేశ్వరశాస్త్రి నాయకత్వంలో మే 28న ఈ దాడి చేయాలని నిర్ణయించారు. దీనిని ముందుగా పసిగట్టిన బ్రిటిష్ పోలీసులు అక్కడికి చేరిన అనేకమందిని అరెస్టు చేసి లారీల్లో తరలించి కలెక్టరు ముందు హాజరుపరిచారు. అందులో మహిళలూ ఉన్నారు. బి.బుచ్చి సీతారామచంద్రరాజు, కె.బుచ్చిరాజు తదితరులు అరెస్టయ్యారు. తరువాత ఈ దాడిని కొనసాగించబోయిన దిగుమర్తి జానకీబాయి కూడా అరెస్టయ్యారు. ఆ తరువాత అక్కడక్కడ కొన్ని సంఘటనలు జరిగినా ఉప్పు సత్యాగ్రహం క్రమంగా బలహీనపడింది.

స్వాతంత్ర్యోద్యమ కీర్తిపతాక.. విశాఖ

(మొదటి పేజీ తరువాయి..) తరిమేందుకు ఉద్యమ పతాకను ఎగర వేయగా... ఆ తర్వాత స్వతంత్ర్య గడ్డపైనా ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, తీర ప్రాంతంలో స్టీల్‌ప్లాంట్ సాధన కోసం ఉద్యమాలు సాగాయి. ఒక్కో ఉద్యమం దేనికదే విడివిడిగా సాగినా దేశ, రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా అవి ముందుకు సాగాయి. దేశంలో స్వాతంత్ర్యం సాధ్యమయ్యాక సాధించుకున్న, జాతీయం కాబడిన పలు ప్రభుత్వ రంగ సంస్థలకు కేంద్రంగా విశాఖపట్నం వెలుగొందుతూ వస్తోంది.

త్యాగాల విశాఖ

స్వాతంత్ర్యోద్యమం అంటేనే త్యాగాలమయం. పైగా దీర్ఘకాల పోరాటం.. మన దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో విశాఖ జిల్లా ప్రత్యేక పాత్రనే పోషించింది. జిల్లా నుంచి ఎంతో మంది యువకులు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. 1928లో ఖద్దరు ప్రచారం, 1930లో ఉప్పు సత్యాగ్రహం, 1932లో శాసనోల్లంఘన, 1942లో క్విట్ ఇండియా కార్యక్రమాలు విశాఖలోనూ సాగాయి. జాతీయ నాయకత్వం ఇచ్చిన ప్రతి పిలుపులోనూ ఈ జిల్లా వాసులు పాల్గొనడం విశేషం. ఎవిఎన్, ఆంధ్రా మెడికల్ కళాశాలల్లో అనేకమంది చదువులకు స్వస్తి చెప్పి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. బ్రిటిష్ పోలీసుల చేతుల్లో వందలాది మంది లాఠీదెబ్బలు తిన్నారు. అరెస్టయ్యారు. జైలు శిక్షలు అనుభవించారు. విశాఖపట్నం, అనకాపల్లి, మాడుగుల, యలమంచిలి వంటి ప్రాంతాల నుంచి పెద్దఎత్తున అలుపెరగని పోరాటాలు నడిపారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్‌లో కూడా ఈ ప్రాంతం నుంచి అనేక మంది చేరారు. తెల్లవాడి దాస్య శృంఖలాల నుంచి విముక్తి కోసం సాగిన పోరాటంలో అల్లూరి సీతారామరాజు విశాఖ మన్యంలో సాగించిన పోరాటం మకుటాయమానంగా నిలుస్తోంది. స్వాతంత్ర్య ఉద్యమంలో జిల్లాకు చెందిన కమ్యూనిస్టు నాయకులు కీలకపాత్ర పోషించారు. తెల్లవాడి పాలనపై 18వ శతాబ్దంలోనే విశాఖ జిల్లాలోని అనేకచోట్ల తిరుగుబాట్లు జరిగాయి. 1780 అక్టోబర్ 3న విశాఖ రెజిమెంటులో సిపాయిలు బ్రిటిష్ అధికారులపై తిరుగుబాటు చేశారు. 1794 జులై 9న పద్మనాభ యుద్ధం బ్రిటిష్‌వారి వైఖరిలో పెద్ద మార్పు తీసుకొచ్చింది. విశాఖపట్నాన్ని సైనిక కేంద్రంగానూ, పాలనా కేంద్రంగానూ బలోపేతం చేయాలని బ్రిటిష్‌వారు ఈ యుద్ధం తరువాత నిర్ణయం తీసుకున్నారు.

స్ఫూర్తిని కొనసాగిస్తూ.. ఉవ్వెత్తున ఎగిసిపడుతూ..

పూర్వపు పోరాట బీజాలు విశాఖను వెన్నంటే ఉన్నాయనడానికి నేడు జిల్లాలో సాగుతోన్న అనేక ప్రజా, కమ్యూనిస్టు పోరాటాలు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. స్వాతంత్ర్య వీరులు నింపిన ఉద్యమ స్ఫూర్తి నేటికీ ప్రతిబింబిస్తోందనడానికి ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకునే పోరాటాలే తార్కాణం. అల్లూరి సీతారామారాజు అమాయక గిరిజనులను కదిలించి సాగించిన పోరాటం నేటికీ ఆ గిరిజనుల్లో స్ఫూర్తి నింపుతూ ఉంది. బాక్సైట్, ఇతర ఖనిజ నిక్షేపాలు తవ్వకాలకు వ్యతిరేకంగా ఆదివాసీలు ఉమ్మడి విశాఖలో గళమెత్తుతూనే ఉన్నారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితోనే నేడు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం సాగుతోంది. కేంద్రంలోని కాషాయ బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కబంధ హస్తాల్లోకి తీసుకెళ్లాలనే ప్రయత్నాలను, బిజెపి మతోన్మాద, ప్రైవేటీకరణ విధానాలను విశాఖలో సిపిఎం, సిఐటియు నాయకత్వంలో కమ్యూనిస్టు ఉద్యమం, కార్మికోద్యమాలు తిప్పికొడుతూ వస్తున్నాయి.